1
నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | జూన్ 14, 2024 | www.navatelangana.com

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతి


నర్సింలు (ఫైల్)

నవతెలంగాణ-భిక్కనూర్

చేపలవేటకు వెళ్లి వ్యక్తి మృతిచెందాడు. ఈ ఘటన భిక్కనూరు పట్టణంలో గురువారం చోటుచేసుకుంది. స్థానికులు, కుటుంబీకులు, పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం భిక్కనూరు పట్టణానికి చెందిన నర్సింలు (53) గ్రామ పంచాయతీ సమీపంలో ఉన్న బొబ్బిలి చెరువులో బుధవారం చేపలు పట్టడానికి వెళ్లి వస్తానని చెప్పి రాత్రి వరకు ఇంటికి తిరిగి రాలేదు. గురువారం ఉదయం కుటుంబీకులు చుట్టుపక్కల ఎంత వెతికినా ఆచూకీ లభించకపోవడంతో చెరువు వద్దకు వెళ్లి చూడగా.. నర్సింలు శవమై కనిపించాడు. విషయం తెలుసుకున్న పోలీసులు ఘటనా స్థలానికి చేరుకొని శవాన్ని చెరువులో నుంచి బయటకు తీసి పోస్టుమార్టం నిమిత్తం కామారెడ్డి ఏరియాసుపత్రికి తరలించి కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

మిషన్ భగీరథ సర్వే పరిశీలించిన డీఎల్‌పీఓ


సర్వే నిర్వహిస్తున్న డీఎల్‌పీఓ

నవతెలంగాణ-భిక్కనూర్

మండలంలోని భిక్కనూర్, జంగంపల్లి గ్రామాలలో నిర్వహిస్తున్న మిషన్ భగీరథ సర్వే కార్యక్రమాన్ని, మంచినీటి పైప్‌లైన్‌లను డీఎల్‌పీఓ శ్రీనివాస్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఒక కుటుంబంలో ఐదుగురు వ్యక్తుల కంటే ఎక్కువ మంది నివసిస్తే మరో మంచినీటి కనెక్షన్ తీసుకోవాలని, గతంలో నిర్వహించిన మిషన్ భగీరథ సర్వే పనులను పరిశీలించారు. ప్రతీ ఇంటికి మంచినీరు వస్తుందా లేదా అని ప్రజలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం భిక్కనూర్ గ్రామపంచాయతీ కార్యాలయంలో రికార్డులను పరిశీలించి సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీవో ప్రవీణ్ కుమార్, పంచాయతీ కార్యదర్శి మహేష్‌గౌడ్, పంచాయతీ సిబ్బంది, తదితరులున్నారు.

ఆశాలకు పరీక్షలు నిర్వహించొద్దు

- ఆశాలకు అన్నింట్లోనూ అవగాహన ఉంది
- స్పష్టం చేసిన సిఐటీయు నాయకులు
- కలెక్టరేట్ ఎదుట పెద్ద ఎత్తున ధర్నా


కలెక్టరేట్ ఎదుట ధర్నా చేస్తున్న ఆశావర్కర్లు

నవతెలంగాణ-కామారెడ్డి

ప్రస్తుతం తెలంగాణలో పనిచేస్తున్న ఆశావర్కర్లకు వారి పనిలో అవగాహన ఉందని, వారికి కొత్తగా పరీక్షలు నిర్వహించడం వల్ల ఒరిగేదేమీ లేదని సిఐటీయు నాయకులు తెలిపారు. ఆశాలకు పరీక్షలు నిర్వహిస్తామని ప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని వెనక్కి తీసుకోవాలని కోరుతూ కామారెడ్డి జిల్లా కేంద్రంలో తెలంగాణ ఆశావర్కర్స్ యూనియన్ సిఐటీయు ఆధ్వర్యంలో గురువారం కలెక్టరేట్ ముందు ధర్నా నిర్వహించి కలెక్టర్ కార్యాలయంలో వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా సిఐటీయు నాయకులు మాట్లాడుతూ..

తెలంగాణ రాష్ట్రంలో ఆశావర్కర్లకు గిరిజన ప్రాంతంలో 33 సంవత్సరాలు, మైదాన ప్రాంతంలో గత 19 సంవత్సరాల నుంచి పనిచేస్తున్నారన్నారు. ప్రారంభం నుంచి ఇప్పటివరకు ప్రభుత్వం నిర్వహించిన అనేక శిక్షణలు పొందారని తెలిపారు. రిజిస్టర్లు రాయడం, సర్వేలు చేయడం, ఆన్‌లైన్ పనిచేయడం, బీపీ, షుగర్, థైరాయిడ్ తదితర అన్ని రకాల జబ్బులను గుర్తిస్తున్నారన్నారు. ప్రభుత్వం పంపిణీ చేస్తున్న మందులను ప్రజలకు అందజేస్తున్నారన్నారు. ఆశావర్కర్లు ఎప్పటికప్పుడు ప్రజలకు కాలానికి అనుగుణంగా తగిన జాగ్రత్తలను సూచిస్తున్నారన్నారు. వీటితోపాటు గర్భిణీ, బాలింతలు, చిన్నపిల్లలకు, ఇతర ప్రజలకు ఆరోగ్య సేవలు అందిస్తున్నారని వివరించారు. కరోనా మహమ్మారి కాలంలో కరోనాను నియంత్రించడంలో ఆశావర్కర్లు కీలక పాత్ర పోషించారని ప్రపంచ ఆరోగ్య సంస్థ హెల్త్ గ్లోబల్ లీడర్స్ అని ఆశా వర్కర్లకు అవార్డును సైతం ప్రకటించిందని చెప్పారు. ఇన్ని పనులు నిర్వహిస్తూ ఇంత సీనియారిటీ ఉన్న ఆశావర్కర్లకు మళ్ళీ కొత్తగా పరీక్షలు నిర్వహించి కొత్తగా ఆశావర్కర్లు తమ జ్ఞాపక శక్తిని నిరూపించుకోవలసిన అవసరం లేదన్నారు. గతంలో బీఆర్ఎస్ ప్రభుత్వం ఇదే నిర్ణయాన్ని ముందుకు తెచ్చి అమలు చేయాలని చూసిందని, ఈ నిర్ణయానికి వ్యతిరేకంగా రాష్ట్రవ్యాప్తంగా ఆశలు పెద్ద ఎత్తున పోరాటాలు చేయడంతో ప్రభుత్వ వెనకకు తగ్గి 2023 జూన్ 5న జరిగిన ఆశాల టెలికాన్ఫరెన్స్ సమావేశంలో మాజీ ఆరోగ్య శాఖ మంత్రి హరీష్ రావు ఆశాల ఎగ్జామ్స్‌ను రద్దు చేస్తున్నామని ప్రకటించారన్నారు. అసెంబ్లీ ఎన్నికల అనంతరం అనేక హామీలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ఆశలకు మళ్ళీ కొత్త సమస్యలు తేవడం న్యాయం కాదన్నారు. ఆశాలకు పరీక్షలు పెట్టడం ద్వారా ప్రభుత్వం ఇచ్చే సర్టిఫికెట్ వల్ల ఆశలకు కలిగే లాభాలు ప్రభుత్వం ఇచ్చిన సర్క్యులర్ ఏమీ లేవని, అంటే ఏఎన్ఎం ప్రమోషన్ లాంటి తదితర ఎలాంటి సౌకర్యాలు అందులో లేవని తెలిపారు. కేవలం ఆశాల పనిని పనుల పట్ల ఆశాల జ్ఞాపకశక్తిని నిరూపించుకుంటే ఒక సర్టిఫికెట్‌కు రూ.5000 ఇస్తామని ప్రభుత్వం సర్క్యులర్‌లో తెలియజేసిందన్నారు. ఆశాలు అనేక సంవత్సరాల నుంచి కనీస వేతనం 26,000 ఇవ్వాలని, పీఎఫ్, ఈఎస్ఐ తదితర సౌకర్యాలు కల్పించాలని కోరుతున్నారన్నారు. ఈ అంశాన్ని పరిగణలోకి తీసుకోకుండా కొత్తగా పరీక్షలు రాసి ఉత్తీర్ణులు అయితే రూ.5వేలు బిక్ష వేస్తామనడం అన్యాయమన్నారు. పరీక్షలు రాసిన వారికి అందులో ఎలాంటి ఉపయోగాలు లేవని, పైగా పరీక్షలు రాసి ఫెయిల్ అయిన వారిని మొత్తం ఎగ్జామ్స్ రాయలేని పరిస్థితిలో ఉన్న ఆశాలను తర్వాత ప్రభుత్వం ఏమైనా చేసే అవకాశం ఉందని, అవసరమైతే విధుల నుంచి తొలగించే ప్రమాదం లేకపోలేదని అన్నారు. ఆశాలకు నష్టం కలిగించే ఎగ్జామ్స్ పెట్టే నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వం తక్షణమే ఉపసంహరించుకోవాలని డిమాండ్ చేశారు. అసెంబ్లీ ఎన్నికలకు ముందు ఆశాలకు, ఆశాల సమ్మె సందర్భంగా గత ప్రభుత్వం, ఆ తర్వాత ప్రస్తుత ప్రభుత్వం ఇచ్చిన హామీలను వెంటనే అమలు చేయాలని అన్నారు. ఈ కార్యక్రమంలో సిఐటీయు జిల్లా అధ్యక్షులు చంద్రశేఖర్, జిల్లా కార్యదర్శి రాజనర్సు, ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఇందిరా తదితరులు పాల్గొన్నారు.

జుక్కల్‌లో భారీ వర్షం.. రైతుల్లో హర్షం..



నవతెలంగాణ-జుక్కల్


మండలంలోని పలు గ్రామాల్లో గురువారం భారీ వర్షం కురిసింది. దీంతో రైతులు హర్షం వ్యక్తం చేశారు. దీంతో రైతులు శుక్రవారం నుంచి వ్యవసాయ పనుల్లో నిమగ్నం కానున్నారు. ఇప్పటికే ఎరువులు, విత్తనాలు తెచ్చి సిద్ధంగా ఉంచుకున్నారు.

చిన్నారి అపహరణ కేసులో
నిందితురాలికి జైలుశిక్ష


నవతెలంగాణ-బోధన్

చిన్నారిని అపహరించిన ఘటనలో ముద్దాయికి ఒక సంవత్సరం జైలు శిక్షతో పాటు వంద రూపాయల జరిమానాను విధిస్తూ గురువారం బోధన్ అసిస్టెంట్ సెషన్ కోర్టు జడ్జ్ దేవన్ జకుమార్ తీర్పు వెల్లడించారు. బోధన్ కోర్టు లైజనింగ్ అధికారి తెలిపిన వివరాల ప్రకారం.. 2022 నవంబర్ నెలలో మేకల లక్ష్మి అనే మహిళ తన భర్తతో తలెత్తిన గొడవల కారణంగా తన చిన్న కూతురు అయిన పది నెలల పాపను తీసుకొని తల్లిగారిల్లు చిన్నమావందిలో ఉంటుంది. ఈ క్రమంలో తన చిన్న పాప ఆరోగ్య పరిస్థితి బాగా లేకపోవడంతో బోధన్ ప్రభుత్వ ఆసుపత్రికి అదె నెల 7వ తేదిన వచ్చింది. అయితే 9వ తేదిన తన పాపతో కలిసి నాదెల్లి మసీదు వద్ద నిద్రించింది. కానీ ఉదయం నిద్ర లేచి చూసేసరికి పాప కనిపించలేదు. తన భర్త తన పాపను తీసుకెళ్లాడని ఆమె అనుమానం వ్యక్తం చేస్తూ బోధన్ టౌన్ పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఫిర్యాదు అందుకున్న అప్పటి ఇన్‌స్పెక్టర్ బి.డి.ప్రేమ్‌కుమార్ కేసు నమోదు చేసి ఎస్ఐ నవీన్‌తో దర్యాప్తు పూర్తి చేశారు. ఈ దర్యాప్తులో గంగామణి, అంజలి, షామీంబేగ, షహనాజ్ పర్వీన్‌లను పట్టుకుని అరెస్టు చేసి కోర్టులో చార్జిషీట్ దాఖలు చేశారు. అయితే ఈ కేసులో పోలీసుల తరపున అడిషనల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ డాక్టర్ సమ్మయ్య వాదించారు. దాంతో బోధన్ అసిస్టెంట్ సెషన్ జడ్జ్ దేవన్ అజయ్ కుమార్ పూర్తి విచారణ చేపట్టి ముద్దాయి చిన్నకుట్ల గంగామణికి ఏడాది పాటు కఠిన కారాగార శిక్షతో పాటు 100 రూపాయల జరిమానా విధించారు. జరిమానా చెల్లించని పక్షంలో మరో 15 రోజులపాటు సాధారణ జైలు శిక్ష అనుభవించాలని తీర్పు వెల్లడించారు. ఈ కేసులో సహకరించిన ఏసీపీ శ్రీనివాస్, ఇన్‌స్పెక్టర్ వీరయ్య కోర్టు లైజనింగ్ ఆఫీసర్ శంకర్, కోర్టు పోలీసులు లక్ష్మణ్, గణేష్ ఉన్నారు.

తవ్వారు.. వదిలేశారు..


ప్రమాదకరంగా గుంత

- గుంతను పూడ్చడంలో నిర్లక్ష్యం
- ప్రమాదకరంగా మారిన పైప్‌లైన్ గుంత



నవతెలంగాణ-ఎడపల్లి

గుంతను పూడ్చడంలో అధికారుల నిర్లక్ష్యం వహిస్తున్నారు. బోధన్ నిజామాబాద్ ప్రధాన రహదారి పక్కన ఎడపల్లి మండల కేంద్రంలోని ఏడవ వార్డులో సుమారు పది రోజుల క్రితం మంచినీటి ట్యాంకు ద్వారా గ్రామంలోకి వెళ్లే నీటి సరఫరా సిమెంట్‌పై పైపు లీకేజీ అవడంతో మరమ్మతుల కోసం అక్కడ గుంతను తవ్వారు. మరమ్మతులు చేపట్టి.. గుంతను పూడ్చాల్సి ఉన్నా.. అధికారులు పట్టించుకోవడం లేదు. దీంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇప్పటికైనా పైప్‌లైన్‌కు మరమ్మతులు చేపట్టి.. గుంతను పూడ్చాలని కోరుతున్నారు.

గుర్రపు డెక్క.. పెరిగింది ఎంచక్కా..


చెరువులో పెరిగిన గుర్రపు డెక్క

నవతెలంగాణ-పోతంగల్

ఈ పచ్చదనం చూసి.. ఇదేదో ఖాళీ స్థలంలో పెరిగిన పచ్చగడ్డి అనుకుంటే పొరపడినట్టే. పోతంగల్ మండల కేంద్రానికి సమీపంలోని ఊరిచెరువులో గుర్రపు డెక్క ఇలా నిండిపోయింది. దాంతో ఆ చెరువులో నీరు కూడా ఏర్పడటం లేదు. సుమారు 100కుపైగా ఎకరాల ఆయకట్టు రైతులు ఈ చెరువు నీటిపైనే ఆధారపడి వానకాలం, యాసంగి పంటలను సాగుచేస్తున్నారు. ప్రస్తుతం వర్షాకాలం సమీపించిన నేపథ్యంలో వాననీరు ఈ చెరువులో నిల్వ ఉండాలన్నా.. రైతులకు రెండు పంటలు నీరు అందాలన్నా.. ఈ గుర్రపు డెక్కను తొలగించాలని స్థానిక రైతులు కోరుతున్నారు.

ముమ్మరంగా వరినాట్లు



నవతెలంగాణ-రెంజల్

మండలంలో వరినాట్లు ఊపందుకున్నాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమవడంతో బోరుబావుల వద్ద వరినాట్లను ప్రారంభించారు. వరినాట్లు వేసేందుకు హర్యానా, బెంగాల్, తదితర రాష్ట్రాల నుంచి కూలీలను తీసుకొచ్చి నాట్లు వేయిస్తున్నారు.

నియోజకవర్గ అభివృద్ధికి రూ.250 కోట్లు

- ఎమ్మెల్యే మదన్మోహన్‌రావుకు హామీనిచ్చిన ముఖ్యమంత్రి


సీఎంకు పుష్పగుచ్ఛాన్ని అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-లింగంపేట్

ఎల్లారెడ్డి శాసనసభ్యులు మదన్ మోహన్‌రావు గురువారం ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. నియోజకవర్గంలో ప్రధాన సమస్యలను, ప్రజల అవసరాలను ముఖ్యమంత్రికి నివేదించారు. ఎల్లారెడ్డి నియోజకవర్గంలో ప్రధానంగా రైతులు సాగునీటిపై ఆధారపడి ఉండడంతో ప్రాజెక్టుల నిర్మాణం చేపట్టాలని, దీని ద్వారా వేలాది ఎకరాలకు సాగునీరు రైతులకు అందిస్తామన్నారు. ఎల్లారెడ్డి ప్రాంతం పచ్చని పంటలతో సస్యశ్యామలం అవుతుందన్నారు. అదేవిధంగా ప్రయివేట్ పాఠశాలలకు ధీటుగా ప్రభుత్వ పాఠశాలలో మౌలిక వసతులు, నూతన భవనాలు, తరగతి గదుల నిర్మాణం తదితర అంశాల గురించి ముఖ్యమంత్రికి వివరించారు. ముఖ్యమంత్రి సానుకూలంగా స్పందించి నియోజకవర్గ అభివృద్ధికి రూ.250 కోట్ల నిధులు ఇస్తానని హామీనిచ్చినట్టు ఎమ్మెల్యే తెలిపారు.

పదోన్నతులు పొందిన అధికారులకు సన్మానం


పదోన్నతులు పొందిన ఉద్యోగులను సన్మానించిన పలువురు

నవతెలంగాణ-కామారెడ్డి

జిల్లా విద్యాశాఖ అధికారి కార్యాలయంలో అసిస్టెంట్ కమిషనర్ ఆఫ్ గవర్నమెంట్ ఎగ్జామినేషన్స్ ఏసిజిఈగా బాధ్యత తీసుకున్న సిహెచ్ బలరాం, అలాగే డిసిఈబి కార్యదర్శిగా బాధ్యతలు స్వీకరించిన నీల లింగంను విద్యాశాఖ అధికారితో పాటు జిల్లా వివిధ ఉపాధ్యాయ సంఘాల నాయకులు సన్మానించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ గతంలో కామారెడ్డి జిల్లాలో తమ విధులు బాధ్యతగా నిర్వహించి అందరి మనసులో నిలిచిపోయారని, ప్రస్తుతం ఈ పదవుల్లో కూడా అలాగే పని చేస్తూ అందరి మనసులో నిలిచిపోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి ఎస్ రాజు, మండల విద్యాశాఖ అధికారులు రామస్వామి, జోసఫ్, పిఆర్‌టియు జిల్లా అధ్యక్షుడు పి దామోదర్‌రెడ్డి, టిపిటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి సిహెచ్. అనిల్‌కుమార్, గెజిటెడ్ ప్రధానోపాధ్యాయుల సంఘం ప్రధాన కార్యదర్శి వెంకటరమణ, టి.శ్రీనివాస్, నాగభూషణం, హనుమాన్లు, శ్రీకాంత్, నర్సారెడ్డి, జస్వంత్ తదితరులు పాల్గొన్నారు.

20న నులిపురుగుల
నిర్మూలన దినోత్సవం


మాట్లాడుతున్న అదనపు కలెక్టర్

- స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి

నవతెలంగాణ-కామారెడ్డి

పిల్లలలో నట్టల నివారణకు ఈ నెల 20న 14వ జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవాన్ని నిర్వహిస్తున్నామని స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నిర్మూలన దినోత్సవ కార్యక్రమంపై ఏర్పాటు చేసిన జిల్లా టాస్క్‌ఫోర్స్ కమిటీ సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. నులి పురుగులు ఉంటే రక్తహీనత, పోషకాహార లోపం, ఆకలి లేకపోవడం, కడుపునొప్పి వంటి వాటితో బాధపడతారని అన్నారు. ప్రధానంగా గ్రామీణ ప్రాంతాలలో పేద పిల్లలు చెప్పులు లేకుండా నడవడం వల్ల వచ్చే అవకాశముందని అన్నారు. జిల్లాలో 1 నుంచి 19 సంవత్సరాలలోపు 2,50,254 పిల్లలున్నారని గుర్తించినట్టు చెప్పారు. వారికి నులిపురుగుల దినోత్సవం సందర్భంగా ఈ నెల 20న ఆల్బెండజోళ్ మాత్రలు వేయనున్నామన్నారు. రెండు సంవత్సరాలలోపు పిల్లలకు సగం మాత్ర, రెండు నుంచి మూడు సంవత్సరాలలోపు పిల్లలకు ఒక మాత్రను నలిపి ఇవ్వాలని, 3 నుంచి 19 సంవత్సరాలలోపు పిల్లలకు చప్పరించేలా వేయించాలని అధికారులకు తెలిపారు. ఈ మందులు వేసుకోవడం వల్ల ఎలాంటి సైడ్‌ఎఫెక్ట్స్ రావని, మధ్యాహ్న భోజనం చేసిన తరువాత పిల్లలు మాత్ర వేసుకునేలా అందరూ అధికారులు సమన్వయంతో పనిచేయాలని కోరారు. ఏదేని కారణం చేత ఆ రోజు తప్పిపోయిన పిల్లలకు ఈ నెల 27న మాప్ అప్ కార్యక్రమాన్ని నిర్వహించి మాత్రలు అందించాలని అన్నారు. అన్ని అంగన్వాడి కేంద్రాలు, ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలలు, కళాశాలలు, వసతి గృహాలలో ఏ ఒక్కరినీ విడిచిపెట్టకుండా మాత్రలు వేయాలని అన్నారు. ఇతర ప్రాంతాలు, రాష్ట్రాల నుంచి వచ్చినవారికి సైతం ఆల్బెండజోల్ మాత్రలు పిల్లలకు వేయించాలని, ఎట్టి పరిస్థితులలో మాత్రలు ఇంటికి తీసుకెళ్లేందుకు అనుమతించకుండా చూడాలని అన్నారు. ఇందుకు ఉపాధ్యాయులు, అంగన్వాడీ కార్యకర్తలు, ఆశకార్యకర్తలు, స్వచ్ఛంద సంస్థలు, మహిళా సంఘాలు కృషి చేయాలన్నారు. మాత్రలు వేసుకున్న తర్వాత పిల్లలకు తాగునీటిని అందించాలన్నారు. ప్రభుత్వం అందించే ఆల్బెండజోళ్ మాత్రలు చాలా శ్రేష్ఠమైనవని, ఒక్క నులిపురుగు నివారణకే గాక ఎలాంటి ఇన్ఫెక్షన్‌లు రాకుండా ఈ మాత్ర పనిచేస్తుందని అన్నారు. ఈ మాత్రలు వందశాతం పిల్లలు వేసుకునేలా జూన్ 20న అందరు పిల్లలు పాఠశాలలు, కళాశాలలకు వచ్చేలా క్షేత్రస్థాయిలో ముమ్మరంగా పర్యటించి పర్యవేక్షణ చేయాలన్నారు. అత్యవసర సమయంలో 108 అంబులెన్స్ అందుబాటులో ఉంచాలన్నారు. ఈ కార్యక్రమంపై గ్రామ, మున్సిపల్ స్థాయిలో టాంటాం ద్వారా ప్రచారం చేయాలని, డిపిఓ, మున్సిపల్ కమిషనర్లకు సూచించారు. పిల్లలు నులిపురుగుల బారిన పడకుండా ఉండేందుకు శుభ్రమైన నీటిని తాగడం, ఆహారంపై ఈగలు దోమలు ఆలకుండా సరైన ఆహారాన్ని తీసుకునేలా చేయడం, భోజనం చేసే ముందు, మరుగుదొడ్డిని ఉపయోగించిన తర్వాత చేతులు శుభ్రంగా కడుక్కోవడం, పరిసరాలను శుభ్రంగా ఉపయోగించుకోవడం, బహిరంగ ప్రదేశాలలో మలవిసర్జన లాంటివి చేయకుండా ఉండేలా ప్రజలలో, పిల్లలలో అవగాహన కల్పించాలని శ్రీనివాస్ రెడ్డి సూచించారు.

ప్రధానంగా జిల్లా సంక్షేమ అధికారి, విద్యాశాఖ అధికారి, ఇంటర్మీడియట్ విద్యాశాఖ అధికారులు అన్ని పాఠశాలలు, కళాశాలలకు నులిపురుగుల నివారణ దినోత్సవంపై సమాచారాన్ని పంపడమే కాకుండా మాత్రలు వేయించే విధంగా చూడాలన్నారు. ఈ సమావేశంలో ఇంచార్జి జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి చంద్రశేఖర్, ఎన్‌సిడి ప్రోగ్రాం అధికారి శిరీష, డిపిఓ శ్రీనివాస్, ఎస్సి కార్పొరేషన్ ఈడి దయానంద్, గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ, జిల్లా సంక్షేమాధికారి బావయ్య, ఇంటర్మీడియట్ నోడల్ అధికారి షేక్ సలాం, డీఈఓ, మెప్మా, మునిసిపల్ శాఖల నుంచి ప్రతినిధులు, రెడ్‌క్రాస్ సంస్థ చైర్మన్ రాజన్న తదితరులు పాల్గొన్నారు.

ఏకరూప దుస్తులు అందజేత

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలోని పడకల్ గ్రామంలోని పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులను గ్రామఅభివృద్ధి కమిటీ సభ్యులు అందజేశారు. ప్రభుత్వం ద్వారా ఉచితంగా వచ్చిన పాఠ్యపుస్తకాలను, ఏకరూప దుస్తులను గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు విద్యార్థులకు ఉచితంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఉపాధ్యాయులు విద్యార్థులు విద్యార్థులు గ్రామ అభివృద్ధి కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.



దుస్తులు పంపిణీ చేస్తున్న దృశ్యం

అర్ధ రాత్రి మొరం టిప్పర్ పట్టివేత

నవతెలంగాణ-బాల్కొండ

మండలకేంద్రంలో ఎలాంటి ప్రభుత్వ అనుమతులు లేకుండా ఇష్టానుసారంగా అధికారుల కళ్లుగప్పి అర్ధరాత్రి సమయంలో అక్రమంగా మొరం తరలిస్తున్న ఓ టిప్పర్ వాహనాన్ని పోలీసులు పట్టుకొని పోలీస్ స్టేషన్‌కు తరలించారు. అర్ధరాత్రి మొరం తరలిస్తున్న ఈ ఘటనపై తహశీల్దార్, రెవెన్యూ సిబ్బందికి సమాచారం లేకుండా పోవడం గమనార్హం. పట్టుకున్న వాహనాన్ని మైనింగ్ శాఖ అధికారికి అప్పగించినట్టు ఎఎస్ఐ శంకర్ తెలిపారు.



పట్టుకున్న మొరం టిప్పర్

మాన్సూన్ యాక్షన్ ప్లాన్‌పై అవగాహన



అవగాహనా సదస్సులో పాల్గొన్న పలువురు

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

మండలంలోని ఆయా గ్రామాల్లోని గ్రామపంచాయతీ కార్యాలయాల్లో గురువారం మాన్సూన్ యాక్షన్ ప్లాన్, సీజనల్ వ్యాధులు, పరిశుభ్రత, తదితర అంశాలపై అవగాహన సదస్సు నిర్వహించారు. ఆయా గ్రామ పంచాయతీ ప్రత్యేక అధికారుల అధ్యక్షతన ఈ అవగాహన సదస్సును నిర్వహించారు. మండలంలోని నాగపూర్, కమ్మర్‌పల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన అవగాహన సదస్సులో ఎంపీడీవో చింతరాజ శ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. వర్షాకాలం ఆరంభమైనందున సీజనల్ వ్యాధులు రాకుండా తగిన చర్యలు చేపట్టాలన్నారు. పారిశుద్ధ్య కార్యక్రమాలను నిర్వహించి గ్రామాలను పరిశుభ్రత గ్రామాలుగా తీర్చిదిద్దాలన్నారు. గ్రామపంచాయతీ కార్మికులతో ఎప్పటికప్పుడు మురికి కాలువలు శుభ్రం చేయించి, బ్లీచింగ్ పౌడర్‌తో శానిటేషన్ చేయించాలన్నారు. ప్రజలు చెత్తాచెదారం మురికి కాలువలో వేయకుండా శుభ్రంగా ఉండేలా పంచాయతీ సిబ్బందికి తమ వంతు సహకారం అందించాలని కోరారు. గ్రామాల్లోని వాటర్ ట్యాంకులను కూడా ఎప్పటికప్పుడు శుభ్రం చేయించి శానిటేషన్ చేయాలన్నారు. గ్రామాల్లో పైపులు ఎందుకు కేజీలు ఉంటే తక్షణమే వాటికి మరమ్మత్తులు చేయించాలన్నారు. కార్యక్రమాల్లో తహసిల్దార్ ఆంజనేయులు, మండల పంచాయతీ అధికారి సదానంద్, ఆయా గ్రామాల పంచాయతీ ప్రత్యేక అధికారులు, పంచాయతీ కార్యదర్శులు, అంగన్వాడి టీచర్లు, ఆశా కార్యకర్తలు, గ్రామపంచాయతీ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

అనుమతులు గోరంత.. తవ్వేది కొండంత



జేసీబీలతో మొరం తవ్వి.. టిప్పర్లలో లోడ్ చేస్తున్న దృశ్యం



మొరం అన్‌లోడింగ్

- **ప్రభుత్వ, పట్టా భూముల్లో మొరం తవ్వకాలు**
- **ఒక్క టిప్పర్ రూ.3వేలకు విక్రయం**

నవతెలంగాణ-మాక్లూర్

ప్రభుత్వ పనులకు అనుమతులు తీసుకొని ప్రయివేట్‌గా అమ్ముకుంటున్న మొరం మాఫియా, అధికారుల కన్ను గప్పి నిజామాబాద్‌లోని వెంచర్లకు, ఇతరచోట్ల అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. మండలంలోని చిన్నాపూర్, సింగంపల్లి గ్రామాల శివారులోని గుట్ట ప్రాంతం నుంచి ఏడీ మైయిన్స్ నిజామాబాద్ నుంచి సుఖిత్ ఫ్యాక్టరీ వద్ద పెద్ద వాగుపై నిర్మిస్తున్న బ్రిడ్జి పనులకు రెండు వేల టిప్పర్ల మొరంకోసం అనుమతులు ఇచ్చారు. వారం రోజులుగా మొరాన్ని తరలించి సుమారు 5 వేల టిప్పర్ల మొరాన్ని తరలించినట్లు సమాచారం. అధికారులకు అడిగితే తమకు ఎలాంటి సంచారం లేదని దాటవేస్తున్నారు.

ప్రకృతి సంపద కొల్లగొడుతూ...

మండలంలో సహజ వనరు అయిన మొరం అక్రమ రవాణా ఆగడం లేదు. కొందరు నాయకులు అధికారులతో కలిసి ధనార్జనే ధ్యేయంగా ప్రకృతి సంపదను కొల్లగొడుతూ అక్రమ దందా జోరుగా సాగిస్తున్నారు. వీరి అక్రమాలకు అడ్డూ అదుపులేకుండా పోతోంది. ప్రభుత్వ భూములనే కాకుండా పట్టా భూములలో ఉండే మొరం తరలిస్తూ లక్షల రూపాయలను సొమ్ము చేసుకుంటున్నారు.

ప్రభుత్వ ఆదాయానికి గాండీ...

ప్రభుత్వ, ప్రయివేట్ భూముల్లో అక్రమ మొరాన్ని తీస్తూ ప్రైవేటుగా భారీగా అమ్ముకుంటూ ప్రభుత్వానికి కట్టాల్సిన రాయల్టీని ఎగ్గొడుతున్నారు. ప్రభుత్వ ఆదాయానికి గండి కొడుతున్నారు. ఇలాంటి వారిపై చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

టిప్పరు రూ. 3 వేల చొప్పున...

కొద్దిపాటి అనుమతులకు కొండల్ని దోచుకొని ప్రభుత్వానికి రాయల్టిని చెల్లించకుండా ఒక్కో టిప్పరు. సుమారు రూ. 3 వేలకు అమ్ముకొని సొమ్ము చేసుకుంటున్నారు. అక్రమ మొరం తరలిస్తున్న వారిపై ఇటు రెవెన్యూ, అటు మైనింగ్ శాఖ అధికారులు పట్టించుకోక పోవడంతో మొరం మాఫియా యథేచ్ఛగా ఆడిందే ఆటగా సాగుతోంది. అక్రమ మొరం మాఫియాపై అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

మైనింగ్ శాఖ అధికారుల అనుమతి
తహశీల్దార్ మహమ్మద్ షబ్బీర్.

రెవెన్యూ శాఖ నుంచి ఎలాంటి అనుమతులు లేవు, ఏడీ మైనింగ్ శాఖ నుంచి అనుమతులు తీసుకొని పెద్ద వాగు బ్రిడ్జి పనులకు తరలిస్తున్నారు. అక్రమంగా ప్రయివేట్ కు తరలించిన వారిపై రెవెన్యూ, మైనింగ్ శాఖ కఠిన చర్యలు తీసుకుంటుంది.

మూడురోజులకోసారి చెత్త సేకరణ

- **మిషన్ భగీరథ సర్వేకు సహకరించాలి**
- **మండల పంచాయతీ అధికారి యూసుఫ్‌ఖాన్**



మాట్లాడుతున్న ఎంపీవో యూసుఫ్

నవతెలంగాణ-జక్రాన్‌పల్లి

మండలంలో అన్ని గ్రామాలలో మూడు రోజులకు ఒకసారి ప్రతి వీధికి చెత్త సేకరించి ట్రాక్టర్ వస్తుందని మండల పంచాయతీ అధికారి యూసుఫ్ ఖాన్ అన్నారు. గురువారం మండలంలోని అర్గుల్ గ్రామంలో మహిళ గ్రామ సంఘ సమావేశం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మండల పంచాయతీ అధికారి యూసుఫ్ ఖాన్ హాజరై మాట్లాడారు. నేటి నుంచి అర్గుల్ గ్రామంలో మిషన్ భగీరథ సర్వే నిర్వహిస్తున్నారని, సర్వేకు ప్రతి ఒక్కరు సహకరించి వారు అడిగిన ప్రశ్నలకు సమాధానం ఇవ్వాలని తెలిపారు. మిషన్ భగీరథ ద్వారా నల్ల నీళ్లు వస్తున్నాయా.. రావడం లేదా.. నీటి సమస్యలు తెలియజేయాలన్నారు. మహిళలందరూ ప్రతి ఇంటిలో తడి , పొడి చెత్త సేకరించి ట్రాక్టర్ వచ్చినప్పుడు చెత్తనువేసి గ్రామాన్ని పరిశుభ్రంగా ఉంచాలని సూచించారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేశ్వర్ ఐకెపి కమ్యూనిటీ కోఆర్డినేటర్, గ్రామ సంఘం ప్రతినిధులు, అన్ని సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

భగీరథ సర్వే త్వరగా పూర్తి చేయాలి

- **జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి**

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

నిర్దేశించిన సమయంలోగా మిషన్ భగీరథ తాగునీటి సర్వేను పూర్తి చేయాలని జిల్లా పంచాయతీ అధికారి తరుణ్ చక్రవర్తి అన్నారు. గురువారం మండల కేంద్రంలో కొనసాగుతున్న మిషన్ భగీరథ తాగునీటి సర్వేను ఆయన ఆకస్మికంగా పరిశీలించారు. పలువురు లబ్ధిదారులతో మాట్లాడిన ఆయన మిషన్ భగీరథ నీరు వస్తుందా? అని అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గ్రామంలో ఇండ్ల సంఖ్య ఎంత అని పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్‌ను ప్రశ్నించగా 2288 ఇండ్లు ఉన్నాయని వివరించాడు. గ్రామంలో పలుచోట్ల మురికి కాలువల్లో చెత్తాచెదారం పేరుకుపోవడం పట్ల పంచాయతీ కార్యదర్శిపై అసహనం వ్యక్తం చేశారు. తక్షణమే మురికి కాలనీలో శుభ్రం చేయించాలని ఆదేశించారు. వర్షాకాలం సీజన్ ఆరంభమైందున ఎప్పటికప్పుడు మురికి కాలువలను శుభ్రం చేయించాలని సూచించారు. సీజనల్ వ్యాధులు ప్రబలకుండా శానిటేషన్ మంచిగా చేయించాలన్నారు. గ్రామంలో ఇంటి పన్నుల డిమాండ్ ఎంత అని అడుగగా రూ. 42లక్షల డిమాండ్ ఉందని కార్యదర్శి తెలిపారు. ఇంటి పన్నుల వసూళ్లపై ప్రత్యేకంగా దృష్టి పెట్టి పన్నుల వసూళ్లను పెంచాలన్నారు. గ్రామపంచాయతీలో సిబ్బంది కొరత ఉందని పంచాయతీ కార్యదర్శి శాంతికుమార్ డిపిఓ దృష్టికి తీసుకెళ్లగా డిప్యూటేషన్‌పై జూనియర్ అసిస్టెంట్‌ను కేటాయిస్తామని తెలిపారు. జిల్లా పంచాయతీ అధికారి వెంట ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్, మండల పంచాయతీ అధికారి సదానంద్, పంచాయతీ కార్యదర్శి శాంతి కుమార్, పంచాయతీ సిబ్బంది, తదితరులు ఉన్నారు.



సర్వేను పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి

కస్తూర్బాలను సద్వినియోగం చేసుకోవాలి

- **ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్**



పరీక్ష అట్టలను పంపిణీ చేస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-కమ్మర్‌పల్లి

గ్రామీణ ప్రాంత విద్యార్థినిలకు నాణ్యమైన ఉచిత విద్యను అందించేందుకు ఏర్పాటు చేసిన కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయాలను సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో చింత రాజ శ్రీనివాస్ అన్నారు. గురువారం మండల కేంద్రంలోని కస్తూర్బా గాంధీ విద్యాలయంలో ఆచార్య జయశంకర్ బడిబాట కార్యక్రమంలో భాగంగా విద్యార్థినిలకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, నోట్ బుక్కులను తహసిల్దార్ ఆంజనేయులు, మండల విద్యాధికారి ఆంధ్రయ్యతో కలిసి పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వం మారుమూల విద్యార్థినిలకు కూడా ఉచితంగా నాణ్యమైన విద్యను అందించాలని లక్ష్యంతో కస్తూర్బా పాఠశాలలను ఏర్పాటు చేశారన్నారు. పాఠశాలలో నాణ్యమైన విద్యను అందించి విద్యార్థినిలు ఉన్నత స్థాయికి ఎదిగేటట్లు ఉపాధ్యాయునిలు శ్రద్ధ వహించాలన్నారు. విద్యార్థినిలు ప్రభుత్వం కల్పించిన సదుపాయాలను ఉపయోగించుకొని నైపుణ్యాలను మెరుగుపరచుకోవాలని సూచించారు. పరిశుభ్రమైన వాతావరణంలో విద్యార్థినిలకు నాణ్యమైన, రుచికరమైన భోజనాన్ని నాన్ టీచింగ్ సిబ్బందితో వండించి అందించాలన్నారు. పాఠశాల ప్రారంభం రోజే బడికి వచ్చిన విద్యార్థినిలకు పరీక్ష అట్టలను అందజేశారు. ఈ కార్యక్రమంలో కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం ప్రత్యేక అధికారిణి గంగామణి, పాఠశాల సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

10 జిపిఏ సాధించిన విద్యార్థులకు సన్మానం



విద్యార్థిని సన్మానిస్తున్న వినయ్‌రెడ్డి

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూర్ మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాలకు చెందిన ఆరుగురు పదో తరగతి విద్యార్థులు పది జీపీఏ సాధించారు. వారిని అభినందిస్తూ విద్యార్థులకు, పాఠశాల విద్యార్థుల అభ్యున్నతికి సహకరించిన హెచ్‌ఎం నరేందర్‌ను నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ ప్రొద్దుటూరి వినయ్ కుమార్ రెడ్డి శాలువా తో గురువారం సన్మానించారు. ఈ పాఠశాల అభ్యున్నతికి సహకరిస్తున్న ఉపాధ్యాయుని, ఉపాధ్యాయులకు విద్యార్థుల భవిత ఉజ్వలంగా ఉండాలని, ఉన్నత శిఖరాలను అందుకోవాలని నిరంతరం శ్రమిస్తునందుకు వారికి ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

నాగంపేట్‌లో క్రికెట్ పోటీలు ప్రారంభం



క్రికెట్ పోటీలను ప్రారంభిస్తున్న ముత్యంరెడ్డి

నవతెలంగాణ-ముప్కాల్

నాగంపేట్ గ్రామంలో బాల్కొండ నియోజకవర్గ స్థాయి సర్కిల్ క్రికెట్ పోటీలను కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షుడు మగ్గిడి ముత్యం రెడ్డి గురువారం ప్రారంభించారు. ఈక్రికెట్ పోటీలు మూడు రోజుల పాటు కొనసాగుతాయని క్రికెట్ నిర్వాహకులు తెలిపారు. పోటీల్లో గెలుపొందిన జట్లకు నగదుతో పాటు ప్రత్యేక బహుమతులు అందజేస్తామన్నారు. మొదటి జట్టుకు రూ.10 వేల రూపాయలు, ద్వితీయ జట్టుకు రూ.5 వేల రూపాయలను అందించనున్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు నాగంపేట్ ముత్తెన్న, మహేందర్, నారాయణ, అమిన్, క్రికెట్ నిర్వాహకులు తదితరులు పాల్గొన్నారు.

గూపన్‌పల్లి పాఠశాల పనులు తనిఖీ చేసిన ఎమ్మెల్యే



విద్యార్థులకు యూనిఫామ్‌లు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-నిజామాబాద్‌రూరల్


నిజామాబాద్ రూరల్ మండలంలోని గూపన్‌పల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో జరుగుతున్న అమ్మ ఆదర్శ పాఠశాల పనులను నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతిరెడ్డి గురువారం పరిశీలించారు. తరగతి గదుల మరమ్మతులు, రూమ్ ఫ్లోరింగ్, వరండా ఫ్లోరింగ్, స్టేజ్ నిర్మాణం పనులను తనిఖీ చేశారు. పాఠశాల ప్రహరీ గోడ నిర్మాణ పనులను తొందరగా ప్రారంభించాలని అన్నారు. పాఠశాల క్రీడా ప్రాంగణాన్ని సరిచేయాలని కాంట్రాక్టర్ ఇంజనీర్లతో ఫోన్లో సంభాషించారు. తదనంతరం పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు ఏ.శకుంతలా దేవి, పాఠశాల సిబ్బందితో మాట్లాడి ఇంకా ఏమైనా సమస్యలుంటే తనను సంప్రదించాలని అన్నారు. పాఠశాలకు అవసరమైన అన్ని సౌకర్యాలను కల్పిస్తానని హామీ ఇచ్చారు. అనంతరం చి విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు నోటు పుస్తకాలు యూనిఫామ్‌లను పంపిణీ చేశారు. పాఠశాల విద్యార్థులతో మాట్లాడి పాఠశాలకు, గురువులకు, తల్లిదండ్రులకు మంచి పేరు తీసుకురావాలని ప్రేరణ కల్పించారు. కార్యక్రమంలో శ్రీనివాస్ రెడ్డి, కృష్ణా రెడ్డి, జయసాగర్, మంజులత, లక్ష్మణ్, అంజయ్య, దేవేందర్, ఉమాదేవి, శ్యామల,కవిత తదితరులు పాల్గొన్నారు.

బైక్‌పై నుంచి పడి యువకుడి మృతి

నవతెలంగాణ-నిజామాబాద్ రూరల్

గుర్తు తెలియని వ్యక్తి సుమారు (25) బైక్‌పై నుండి పడి మృతిచెందాడు. ఈనెల 12రాత్రి 10 గంటల సమయంలో తన టీవీఎస్ ఎక్సెల్ బైక్‌పై జన్నేపల్లి వైపు వెళ్తున్నాడు. ఆకుల కొండూరు శివారు గజానంద్ రైస్ మిల్ ఎదురుగా తనకు తాను అదుపు తప్పి రోడ్డుపై పడిపోగా తలకు బలమైన గాయమై మృతిచెందాడు. అక్కడ ఎలాంటి ఆధారాలు లభించలేదు. మృతదేహం నిజామాబాద్ ప్రభుత్వ ఆసుపత్రి మార్చురీలో ఉంచామని, ఎవరికైనా ఆచూకీ తెలిస్తే నిజామాబాద్ రూరల్ ఎస్ఐ 8712659849 నెంబర్‌కు సంప్రదించాలన్నారు.

గురుకుల పాఠశాలల్లో దరఖాస్తులకు ఆహ్వానం



నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు నందు గల తెలంగాణ మైనారిటీ, ఆర్మూర్ గురుకుల పాఠశాల, జూనియర్ కళాశాలలో 5వ తరగతి నుండి 8వ తరగతి వరకు ముస్లిమ్, క్రిస్టియన్, సిక్కు మైనారిటీ సీట్లు అలాగే ఇంటర్మీడియేట్ ఫస్ట్ ఇయర్‌లో ఎంపీసీ, బైపీసి గ్రూప్‌లో ముస్లిం, క్రిస్టియన్, సిక్కు మైనారిటీ సీట్లకు దరఖాస్తులు ఆహ్వానించడం జరుగుతుందని ప్రిన్సిపాల్ సయ్యద్ హైదర్ గురువారం తెలిపారు. మరిన్ని వివరాలకు సంప్రదించండి సెల్:- 8985783112, 8106424751, 9014503903 సంప్రదించవచ్చుని తెలిపారు.

హెచ్‌పీఎస్ స్కూల్ ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్‌సిటీ

కంఠేశ్వర్ ఉమెన్స్ కళాశాల వద్ద హెచ్‌పీఎస్ స్కూల్ నూతన భవనాన్ని గురువారం అర్బన్ ఎమ్మెల్యే ధన్‌పాల్ సూర్యనారాయణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హెచ్‌పిఎస్ స్కూల్ యాజమాన్యానికి అపారమైన విద్య అనుభవం ఉందని, పిల్లలకు నాణ్యమైన విద్య అందించి, అన్ని రంగాల్లో విద్యార్థులను నిష్ణాత్తులుగా తయారు చేసి ఇందూర్ జిల్లాకి మంచి పేరు ప్రతిష్టలు తీసుకురావాలని సూచించారు. ఈ సందర్భంగా స్కూల్ యాజమాన్యం మేటూరి దయానంద్ గుప్తా, పాల్దే లక్ష్మీకాంతంకు శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇల్లందుల ప్రభాకర్, బట్టికిరి ఆనంద్, పవన్ ముందడ,హరీష్, కిష్ట, బాబీ సింగ్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.



స్కూల్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

హావెల్స్ షోరూంను ప్రారంభం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

కంఠేశ్వర్‌లో నూతనంగా ఏర్పాటు చేసిన హావెల్స్ షోరూంను గురువారం అర్బన్ ఎమ్మెల్యే ధన్ పాల్ సూర్యనారాయణ గుప్తా ప్రారంభించారు. ఈ సందర్భంగా కోవూరు విట్టల్ యాజమాన్యానికి శుభాకాంక్షలు తెలుపుతు రాబోయే రోజుల్లో వ్యాపారం దినదిన అభివృద్ధి చెందాలని అన్నారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఇల్లందుల ప్రభాకర్, బట్టికిరి ఆనంద్, పవన్ ముందడ,హరీష్, కిష్ట, బాబీ సింగ్ నాయకులు పాల్గొన్నారు.



షోరూంను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే

కుటుంబ సభ్యులను పరామర్శించిన నియోజకవర్గ ఇన్చార్జ్

నవతెలంగాణ-ఆర్మూర్

ఆలూరు మండలంలోని దేగం గ్రామంలో జిల్లా పార్లమెంట్ అధ్యక్షులు యాదగౌడ్ అమ్మ ఇటీవలే మృతి చెందారు. నియోజక వర్గ కాంగ్రెస్ పార్టీ ఇంచార్జ్ వినయ్ కుమార్‌రెడ్డి గురువారం వారి ఇంటికి వెళ్ళి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. కార్యక్రమంలో దేగం గ్రామ నాయకులు ముత్యం రెడ్డి, శ్రీనివాస్ గౌడ్, ఆలూర్ కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు ముక్కెర విజయ్, మచ్చర్ల భోజ రెడ్డి, పట్టణ అధ్యక్షులు సాయిబాబాగౌడ్, ఉదయ్, అజ్జు భాయ్, ఫాయీమ్ భాయ్, చిక్కు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



బాధిత కుటుంబ సభ్యులను పరామర్శిస్తున్న వినయ్‌రెడ్డి

గాలివాన బీభత్సం


ఎగిరిపోయిన రేకులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి మండల పరిధిలోని వెళ్లుట్లపేట గ్రామంలో గురువారం సాయంత్రం గాలివాన బీభత్సం సృష్టించింది. కరెంటు తీగలపై చెట్ల కొమ్మలు విరిగి పడి విద్యుత్ సరఫరాకు అంతరాయం కలిగింది. ఇంటి పైకప్పు రేకులు, గుడిసెలపై కవర్లు కొట్టుకుపోయి కొంతమంది తీవ్ర నష్టం జరిగింది. విఠలేశ్వర ఆలయం వద్ద ధర్మశాల రేకులు సైతం ఈదురుగాలులకు ఎగిరిపడ్డాయి.

గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ ఇంటిగ్రేటెడ్ గైడెన్స్‌లో ఉచిత శిక్షణ

నవతెలంగాణ-కామారెడ్డి

యూనియన్ పబ్లిక్ సర్వీస్ కమిషన్ నిర్వహించే సివిల్ సర్వీసెస్ ప్రిలిమ్స్, మెయిన్స్ పరీక్షలు, ఇంటర్వ్యూ 2025 కొరకు సన్నద్ధమయ్యే ఎస్సి, ఎస్టీ, బిసి అభ్యర్థులకు హైదరాబాద్‌లోని గిరిజన ఐఏఎస్ స్టడీ సర్కిల్ నందు ఇంటిగ్రేటెడ్ గైడెన్స్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నామని జిల్లా గిరిజన అభివృద్ధి అధికారి అంబాజీ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. అభ్యర్థులను ఆబ్జెక్టివ్ టైపు, ఆప్టిట్యూడ్ పరీక్ష ద్వారా ఎంపిక చేస్తారని ఆయన తెలిపారు. కాగా కుటుంబ వార్షికాదాయం 3 లక్షలు మించరాదని ఆయన స్పష్టం చేశారు. ఆసక్తి, అర్హత గల అభ్యర్థులు ఈ నెల 30లోగా http://studycircle.cgg.gov.in వెబ్‌సైట్ నందు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ఇతర వివరాల కొరకు పై వెబ్‌సైట్‌తో పాటు http://twd.telangana.gov.in నందు చూసుకోవచ్చని, మరిన్ని వివరాలకు 6281766534 ఫోన్ నెంబరుకు సంప్రదించవచ్చని అంబాజీ తెలిపారు.

మత సామరస్యానికి ప్రతీక.. కామారెడ్డి



మాట్లాడుతున్న కలెక్టర్

- జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్
- బక్రీద్ నేపథ్యంలో శాంతి కమిటీ సమావేశం

నవతెలంగాణ-కామారెడ్డి

మత సామరస్యానికి ప్రతీక కామారెడ్డి జిల్లా అని, ఇక్కడి ప్రజలు కులమతాలకతీతంగా సుహృద్భావ వాతావరణంలో పండుగలు జరుపుకునే సంప్రదాయం ఎంతో సంతోషంగా ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్ అన్నారు. బక్రీద్ పండుగ సందర్భంగా గురువారం కలెక్టరేట్‌లోని ప్రధాన సమావేశ మందిరంలో ఏర్పాటు చేసిన శాంతి కమిటీ సమావేశంలో ఎస్పీ సింధు శర్మతో కలిసి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ నెల 17న బక్రీద్ పండుగ సందర్భంగా ప్రార్థన స్థలాలు, వధశాలల పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచడంతో పాటు బ్లీచింగ్ పౌడర్ చల్లాలని మున్సిపల్ కమిషనర్లను, జిల్లా పంచాయతీ అధికారులకు సూచించారు. నిబంధలు లోబడి పశువుల రవాణా జరిగేలా చూడాలని, అక్రమంగా పశువులను తరలిస్తున్నట్లు తమ దృష్టికి వస్తే ఆ సమాచా రాన్ని పోలీసులకు చేరవేయాలని యువతకు సూచించారు. రెవెన్యూ, పోలీస్, రవాణా శాఖలకు చెందిన అధికారులు నిరంతరం నిఘా ఉండేలా పర్యవేక్షణ చేయాలని అన్నారు. నిబంధనలకు విరుద్ధంగా వివిధ వాహనాలలో పశువులను తరలిస్తే వెంటనే సీజ్ చేసి చట్టపరంగా చర్యలు తీసుకోవాలని సూచించారు. శాంతిభద్రతలకు విఘాతం కలగకుండా పశు వైద్యాధికారులు ధ్రువీకరించిన వాటినే నిర్ధారించిన ప్రాంతాలలో పశువధ జరపాలన్నారు. వ్యర్థ పదార్థాలను వధశాల నుండి డంప్ యార్డ్ కు తరలించుటకు సానిటరీ ఇన్‌స్పెక్టర్ల ద్వారా అవసరమైన ప్లాస్టిక్ బ్యాగు అందించాలని కలెక్టర్ తెలిపారు. డంప్ యార్డుల వద్ద గుంత తీసి వ్యర్థాలను పూడ్చాలని, లేకుంటే దుర్వాసనతో పాటు రోగాలు వచ్చే ప్రమాదముందని హెచ్చ రించారు. ఈ నెల 17 నుంచి 19 వరకు ముస్లింలు అత్యంత పవిత్రంగా జరుపుకునే బక్రీద్ పండుగకు విద్యుత్ అంతరాయం లేకుండా చూడాలని, మంచినీటిని సక్రమంగా సరఫరా చేయాలని అధికారులకు సూచించారు. శాంతిభద్రతలకు భంగం కలిగించే అసాంఘిక శక్తుల పట్ల, అసత్య వార్తలపట్ల అప్రమత్తంగా ఉండాలని కలెక్టర్ హితవు చెప్పారు. ఎస్పీ సింధు శర్మ మాట్లాడుతూ పశువుల అక్రమ రవాణాకు అరికట్టుటకు 5 చెక్‌పోస్టుల వద్ద గట్టి నిఘా ఏర్పాటు చేస్తున్నామన్నారు. నిబంధనలకు లోబడి వాహనాలలో పశువులను తరలిస్తున్నారా? ఓవర్ లోడ్‌తో వెలుతు న్నాయా తనిఖీ చేయాలన్నారు. అక్రమంగా తరలిస్తున్నట్లు గుర్తిస్తే పోలీసులకు సమాచారమందించాలని, వాహనా లను అడ్డగించవద్దని సంఘాలకు, యువకులకు సూచిం చారు. సంతల వద్దే పశువులను పరిశీలించి సర్టిఫికెట్ ఇవ్వా లని పశు వైద్యాధికారులకు సూచించారు. ఈ స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శ్రీనివాస్ రెడ్డి, అడిషనల్ ఎస్పీ నరసింహ రెడ్డి, ఆర్డీఓలు రంగనాథరావు, రమేష్ రాథోడ్, జిల్లా పశు సంవర్ధక అధికారి సింహరావు, డిపిఓ శ్రీనివాస్, ఎస్సి కార్పొ రేషన్ ఈడి దయానంద్, డిఎస్పీలు, మున్సిపల్ అధికారులు, వివిధ కమ్యూనిటీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.


పాల్గొన్న అధికారులు

బదిలీపైన వెళ్తున్న హెచ్‌ఎంకు సన్మానం


హెచ్‌ఎంను సన్మానిస్తున్న దృశ్యం

నవతెలంగాణ-జుక్కల్

మండలంలోని కేమ్రాజ్ కల్లాలీ ప్రధానోపాధ్యాయుడు జయచంద్ నాలుగేండ్లుగా ఎంపియూపిఎస్‌లో విధులు నిర్వహిస్తున్నారు. ఇటీవలే కమిషనర్ ఆదేశాల మేరకు మండలంలోని బస్వాపూర్ ఎంపీయూపీఎస్‌కు బదిలీపై వెళ్లనుండటంతో అనంతరం అక్కడి ఉపాధ్యాయ బృందం గురువారం ఘనంగా సన్మానించారు. బాధ్యతగా ఉంటూ ఉపాధ్యాయులతో కలిసి విద్యాభివృద్ధికి కృషి చేస్తానని హెచ్‌ఎం జయచంద్ పేర్కొన్నారు. కార్యక్రమంలో బస్వాపూర్ ఉపాధ్యాయ బృందం తదితరులు పాల్గొన్నారు.

ఎంపీ సురేష్ షెట్కార్‌కు సన్మానం


ఎంపీ సురేష్ షెట్కార్‌ను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-పెద్దకొడప్‌గల్

జహీరాబాద్ ఎంపీ సురేష్ షెట్కార్‌ను ఆయన స్వగృహంలో కామారెడ్డి జిల్లా వీర శైవ లింగాయత్ కార్యదర్శి, మండల నాయకులు మల్లప్ప పటేల్ శాలువాతో సన్మానించి శుభాకాంక్షలు తెలిపారు. లింగాయత్‌లను ఓబీసీలో చేర్చడానికి కృషి చేయాలని కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. లింగాయత్ సమాజానికి ఎంపి షెట్కార్ చేసిన సేవలు మరువలేమన్నారు. ఆయన కృషివల్లనే 2009లో అప్పటి ముఖ్యమంత్రి స్వర్గీయ వైఎస్ రాజశేఖర్‌రెడ్డి లింగాయత్‌లను బీసీలో చేర్చారని తెలిపారు. అలాగే ప్రస్తుత ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిని ఒప్పించి లింగాయత్‌ల కోసం కార్పొరేషన్ ఏర్పాటు చేయించారని తెలిపారు. కార్యక్రమంలో లింగాయత్ నాయకులు, సంతోష్ పటేల్, ఆకాష్ పటేల్, పవన్ దేశాయ్ పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి వెయిట్ లిఫ్టింగ్‌లో విద్యార్థి ప్రతిభ

- సన్మానించిన బోధన్ ఎమ్మెల్యే


విద్యార్థిని సన్మానిస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-రెంజల్

మండలంలోని ఆదర్శ పాఠశాలకు చెందిన మాలతి పదవ తరగతి విద్యార్థిని రాష్ట్రస్థాయి పోటీలలో ద్వితీయ స్థానం సాధించింది. విద్యార్థినికి బోధన్ ఎమ్మెల్యే శాలువా కప్పి సన్మానించారు. ఇటీవల కరీంనగర్‌లో జరిగిన వెయిట్ లిఫ్టింగ్ 25 కేజీల బరువును అవలీలగా ఎత్తుకొని రెండవ స్థానంలో నిలిచారని పాఠశాల ప్రిన్సిపాల్ బలరాం తెలిపారు. బడిబాట కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి విద్యార్థి మాలతిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీపీ రజిని కిషోర్, జడ్పిటిసి మేక విజయ సంతోష్, ఎంపీడీవో హెచ్ శ్రీనివాస్, ఏపీఎం చిన్నయ్య, వ్యాయమ ఉపాధ్యాయులు ప్రవీణ్ కుమార్, ఉపాధ్యాయుడు సురేష్, మాలతి తండ్రి కృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి

- బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్‌రెడ్డి

నవతెలంగాణ-రెంజల్

కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి రాగానే ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని సారించి సుమారు రెండువేల కోట్ల రూపాయలతో మౌలిక సదుపాయాలను కల్పించనున్నట్లు బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి స్పష్టం చేశారు. గురువారం మండలంలోని ఆదర్శ పాఠశాలలో విద్యార్థులకు ఏకరూప దుస్తులు, ఉచిత పాఠ్య పుస్తకాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఉపాధ్యాయులు అంకితభావంతో పనిచేస్తూ విద్యార్థులను తీర్చిదిద్దాల్సిన బాధ్యత ఉపాధ్యాయులపై ఉందన్నారు. వారికి తాగునీరు, మరుగుదొడ్ల మరమ్మతులపై ప్రత్యేక దృష్టిని సాధించాలని ప్రిన్సిపాల్ బలరాంను ఆదేశించారు. వచ్చే విద్యా సంవత్సరానికైనా విద్యార్థులను జిపిఏ 10/10 తీసుకురావాలని లేనట్లయితే ఉపాధ్యాయులపై చర్యలు తీసుకుంటానని ఆయన హెచ్చరించారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో తెలుగు మీడియం, ఇంగ్లీష్ మీడియం బోధించనున్నట్లు వివరించారు. విద్యార్థి తల్లిదండ్రులు ప్రైవేట్ పాఠశాలలను ఆశ్రయించకుండా ప్రభుత్వ పాఠశాలలో చేరేలా వారికి అవగాహన కల్పించాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షులు మొబిన్‌ఖాన్, ఎంపీపీ రజిని కిషోర్, జెడ్పిటిసి మేక విజయ సంతోష్, డిఆర్‌డిఏ అధికారి సాయగౌడ్, ఆర్డీవో రాజేశ్వర్, జిల్లా విద్యాశాఖ అధికారి దుర్గాప్రసాద్, ఎంపీడీవో శ్రీనివాస్, ఎమ్మార్వో శ్రావణ్ కుమార్, రవి, తదితరులు పాల్గొన్నారు.


పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న ఎమ్మెల్యే

కబ్జాకు గురైన స్థలం కంచె తొలగింపు



కంచెను తొలగిస్తున్న అధికారులు

నవతెలంగాణ-ఎల్లారెడ్డి

ఎల్లారెడ్డి పట్టణ శివారులోని నాగన్న కుంటకు వెళ్లే దారిని పప్పు విశ్వనాథం కబ్జా చేసి దారి లేకుండా కంచె వేశారని నాగన్న కుంట కింది ఆయకట్టు రైతులు నీటిపారుదల శాఖ, రెవెన్యూ శాఖ అధికారులకు ఇటీవల ఫిర్యాదు చేశారు. దీంతో సంబంధిత అధికారులు నాగన్న కుంటను పరిశీలించి పోలీస్‌శాఖ సహాయంతో గురువారం కంచెను తొలగించారు. అనంతరం నీటిపారుదల శాఖ ఏ.ఇ శ్రీకాంత్ మాట్లాడుతూ రైతుల ఫిర్యాదు మేరకు నాగన్న కుంటను పరిశీలించి రైతుల ఫిర్యాదులో వాస్తవం ఉందని జిల్లా కలెక్టర్ జితేష్ వి పాటిల్‌కు తెలపడంతో ఆయన స్పందించి వెంటనే కంచెను తొలగించి రైతులకు ఇబ్బందులు లేకుండా దారి ఏర్పాటు చేయాలని ఆదేశించారని, కలెక్టర్ ఆదేశాల మేరకు కంచె తొలగించామని తెలిపారు. త్వరలో రెవెన్యూ అధికారులతో కలిసి ఇక్కడ భూములను జాయింట్ సర్వే చేస్తామని అన్నారు. నీటిపారుదల శాఖకు సంబంధించి చెరువులు, కుంటల కబ్జాకు ఎవరైనా పాల్పడితే చట్టరీత్యా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆయన వెంట ఎల్లారెడ్డి ఎస్సై మహేష్, పోలీస్ సిబ్బంది, ఆయకట్టు రైతులు తదితరులు పాల్గొన్నారు.

హమాలీల జీవితాలతో ఆటలాడితే ఊరుకోం

- హమాలీలకు సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి
- సీఐటీయూ డిమాండ్



సురేష్‌గొండ

నవతెలంగాణ-జుక్కల్

హమాలీల జీవితాలతో ఆటలాడితే ఊరుకోబోమని హమాలీ ఫెడరేషన్ వర్కర్స్ యూనియన్ (సిఐటియు) జిల్లా అధ్యక్షులు సురేష్ గొండ అన్నారు. గురువారం ఆయన మాట్లాడుతూ.. కాంగ్రెస్ ప్రభుత్వం మేనిఫెస్టోలో ప్రకటించిన విధంగా అసంఘటిత రంగంలో పనిచేస్తున్న హమాలీలకు వెంటనే సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. అదేవిధంగా పిఎఫ్, ఈఎస్ఐ, ప్రమాద బీమా, పెన్షన్ తదితర సౌకర్యాలు హమాలీ సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలన్నారు. గోదాముల దగ్గర మంచినీళ్లు, భోజనశాల, సైకిల్ స్టాండు, విశ్రాంతి గదులు నిర్మించాలని, ప్రభుత్వ సంస్థలలో ఎగుమతి, దిగుమతి పనులు చేస్తున్న హమాలీలను 4వ తరగతి ఉద్యోగులుగా గుర్తించాలని డిమాండ్ చేశారు. ఐఎల్సి తీర్మానం ప్రకారం 50 కేజీల బస్తాలను అన్ని ప్రాంతాల్లో ఖచ్చితంగా అమలు జరిగే విధంగా చర్యలు తీసుకోవాలని కోరారు.

విద్యార్థులకు దుస్తులు పంపిణీ


బోధన్ : విద్యార్థులకు దుస్తులు పంపిణీ


నిజాంసాగర్ : పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-బోధన్/నిజాంసాగర్

బడిబాట కార్యక్రమంలో భాగంగా సాలూర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మండల తహసీల్దార్ రమేష్ విద్యార్థులకు ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు గురువారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయులు మంజుషా, ప్రాథమిక వ్యవసాయ సంఘం అధ్యక్షులు అల్లే జనార్ధన్, అమ్మ ఆదర్శ పాఠశాల అధ్యక్షులు రేఖ, గ్రామపెద్దలు గంగారం, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

నిజాంసాగర్ : మండల కేంద్రంలోని మండల విద్యా వనరుల కేంద్రంలో పాఠ్యపుస్తకాలు పంపిణీ చేసినట్టు ఎంఐఎస్ కోఆర్డినేటర్ రాజు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. మండలానికి 16,667 పాఠ్యపుస్తకాలు వచ్చాయని, దానితోపాటు 23 వేల నోట్ బుక్స్ వచ్చినట్టు ఆయన అన్నారు. ఇంకా 1607 పుస్తకాలు రావాల్సి ఉందని ఆయన తెలిపారు. వీటన్నింటినీ కూడా మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేయనున్నట్టు ఆయన తెలిపారు. సిఆర్పిలు శ్రీధర్ కుమార్, నర్సింలు, వరలక్ష్మి, శంకర్ గౌడ్, వివిధ గ్రామాల ప్రభుత్వ పాఠశాలల ప్రధానోపాధ్యాయులు పాల్గొన్నారు.

పిజిటి ఇంగ్లీష్ బోధనకు దరఖాస్తుల ఆహ్వానం

నవతెలంగాణ-నిజాంసాగర్

మండల కేంద్రంలోని ఆదర్శ పాఠశాలలో ఇంగ్లీష్ సబ్జెక్ట్ బోధించేందుకు తగిన అర్హతలు కలిగిన (ఎంఏ ఇంగ్లీష్ బీఈడీ) పూర్తి చేసిన వారి నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నట్లు ప్రిన్సిపాల్ చంద్రకళ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల అభ్యర్థులు ఆదర్శ పాఠశాలలో 14 జూన్ నుంచి 18 జూన్ వరకు ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు. కనీస వేతనం రూ.18,000 వరకు చెల్లించనున్నట్లు తెలిపారు. పూర్తి వివరాలకు ఆదర్శ పాఠశాలలో సంప్రదించాలని ఆమె సూచించారు.

వృత్తి నైపుణ్యత పరీక్షలు

- జిల్లా మత్స్యశాఖ అధికారి వరద రెడ్డి


వృత్తి నైపుణ్యత పరీక్షల్లో పాల్గొన్న ముదిరాజ్‌లు

నవతెలంగాణ-లింగంపేట్

మండలంలోని మెంగారం ఊరచెరువు వద్ద జిల్లా మత్స్యశాఖ అధికారి వరదరెడ్డి, జిల్లా మత్స్యకారుల సహకార సంఘం చైర్మన్ గాదం సత్యనారాయణ, జిల్లా ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం సబ్ రిజిస్టర్ అధికారి శ్రీనివాస్, కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో వృత్తి నైపుణ్యత పరీక్షలు గురువారం నిర్వహించారు. మండలంలోని మెంగారంలో నూతన మత్స్య పారిశ్రామిక సంఘం ఏర్పాటు చేయుటకు గ్రామంకు చెందిన ముదిరాజ్ కులస్తులకు వృత్తి నైపుణ్యత పరీక్షలు నిర్వహించారు. పరీక్షలు 37 మందికి నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా ముదిరాజ్ సంఘం అధ్యక్షులు బట్టు విట్టల్, జిల్లా ఉపాధ్యక్షులు తూర్పు రాజు, అధ్యక్షులు దాసరి సాయికుమార్, గౌరవ అధ్యక్షులు బొల్లారం సాయిలు, మాజీ అధ్యక్షులులు దురిశెట్టి అశోక్, అధ్యక్షులు రాజారం బాలయ్య, ఆయా గ్రామాల మత్స్యకారులు, తదితరులు పాల్గొన్నారు.

టీబీ నివారణపై అవగాహన

నవతెలంగాణ-బోధన్

మండలంలోని ఊట్‌పల్లి గ్రామంలో హెల్త్ సబ్ సెంటర్‌లో జిల్లా క్షయ నిర్ధారణ వైద్య సిబ్బంది టీబీ నివారణపై రోగులకు గురువారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా టీబీ సూపర్‌వైజర్ ఈశాన్ మాట్లాడుతూ.. జిల్లాలో క్షయవ్యాధి నిర్మూలనకు ఇంటింటికి తిరుగుతూ ఆరోగ్య కార్యకర్తలచే క్షయ రోగులను గుర్తిస్తున్నామని తెలిపారు. అలాగే జిల్లాలో క్షయ, టీబీ లక్షణాలున్న వారిని గుర్తించి వారి నుంచి కఫం సేకరించి రోగనిర్ధారణ పరీక్షలు చేస్తున్నట్లు తెలిపారు. ఊట్‌పల్లి, పెగడాపల్లిలో 30 మంది నుంచి కఫం సేకరించినట్లు ఆయన తెలిపారు. కార్యక్రమంలో డా.ప్రియాంక, టీబీ సూపర్‌వైజర్ పద్మ, ఏఎన్‌ఎం సరస్వతి, ఆశ కార్యకర్తలు ఈరమణి, సావిత్రి, రాజేశ్వరి, సుజాత, అంగన్‌వాడీ టీచర్ కమలు, పంచాయతీ కార్యదర్శి సుభాష్, తదితరులు పాల్గొన్నారు.

ఇంటింటికి భగీరథ నీటి సర్వే

నవతెలంగాణ-బోధన్

గత ప్రభుత్వం మిషన్ భగీరథ పథకంలో భాగంగా ప్రతి కుటుంబానికి స్వచ్ఛమైన తాగునీరు అందించడానికి నీటి కుళాయిలను ఏర్పాటు చేసింది. ఆ పథకంలో భాగంగా మిషన్ భగీరథ నీరు కుళాయిల ద్వారా ఇంటింటికీ అందుతుందా లేదా సాలూర గ్రామ పంచాయతీ పంచాయతీ కార్యదర్శి ప్రవీణ్‌కుమార్, సిబ్బంది విజయ్ ఇంటింటికీ తిరుగుతూ ఆధార్ కార్డులు సేకరిస్తూ సర్వే గురువారం నిర్వహించారు. నీటి కుళాయిలు ఏర్పాటు చేశారు.. కానీ కనీసం చుక్క నీరు రావడం లేదని కాలనీవాసులు పంచాయతీ కార్యదర్శిని నిలదీశారు. చుక్క తాగునీరు అందించని మిషన్ భగీరథ పథకం నల్లాలతో ఉపయోగం లేదని కాలనీవాసులు వాపోయారు.

అపరిచితులతో జాగ్రత్తలు పాటించాలి


అవగాహన కల్పిస్తున్న అధికారులు

నవతెలంగాణ-పిట్లం

బ్యాంకు ఖాతాదారులు గుర్తు తెలియని అపరిచితులతో జాగ్రత్తలు తీసుకుంటూ తమ ఓటీపీ నెంబరు చెప్పవద్దని కామారెడ్డి జిల్లా పోలీసులు అన్నారు. గురువారం మండల కేంద్రంలోని యూనియన్ బ్యాంక్ ఆవరణలో కామారెడ్డి జిల్లా పోలీసు బృందం అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. గుర్తుతెలియని అపరిచితులు ఎవరైనా ఫోన్ చేసి ఓటీపీ నెంబర్ అడిగినా ఇవ్వవద్దని అన్నారు. అలాంటి వారిపై స్థానిక పోలీసులకు సమాచారం అందించాలని సూచించారు. బ్యాంక్‌లో ఏదేని సమస్య తలెత్తితే నేరుగా బ్యాంక్ అధికారులను సంప్రదించి సమస్యను పరిష్కరించుకోవాలని సూచించారు. లేనిపక్షంలో 1930కు ఫోన్‌చేసి ఫిర్యాదు చేయాలని వారు కోరారు. కార్యక్రమంలో ఏఎస్ఐ లింబాద్రి, ఇంచార్జ్ మేనేజర్ శ్రీకాంత్, అసిస్టెంట్ మేనేజర్ లాల్ తేజ, విసి ప్రణీత, సిబ్బంది పాల్గొన్నారు.

ఎమ్మెల్యేను కలిసిన ఈసన్నపల్లి కాంగ్రెస్ నాయకులు

నవతెలంగాణ-రామారెడ్డి

స్థానిక ఎమ్మెల్యే కల్వకుంట్ల మదన్మోహన్‌రావును ఈసన్నపల్లి కాంగ్రెస్ నాయకులు గురువారం కలిసి శాలువాతో సన్మానించి, పుష్పగుచ్ఛాలు అందజేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ సీనియర్ నాయకులు కందూరి లింబాద్రి మాట్లాడుతూ.. అమెరికా పర్యటన ముగించుకొని, నియోజకవర్గ సమస్యల పరిష్కారం కోసం అనునిత్యం ప్రజల మధ్యలో ఉంటూ, సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్న మదన్మోహన్‌రావుకు కృతజ్ఞతలు తెలిపారు. గ్రామ అభివృద్ధికి సహకరించాలని కోరగా, సానుకూలంగా స్పందించారని తెలిపారు. కార్యక్రమంలో మాజీ ఉపసర్పంచ్ బంటు రాజేశ్వర్, నాయకులు శెట్టిపల్లి బైరు, దోమకొండ బైరు, లక్కాకుల శేఖర్, లింగాపురం బాలయ్య, తదితరులు పాల్గొన్నారు.

కాంట్రాక్టు లేదా రెగ్యులర్ ఉద్యోగులుగా గుర్తించండి

● ముఖ్యమంత్రిని కలిసిన 104 ఉద్యోగులు


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసిన ఉద్యోగులు

నవతెలంగాణ-ఆర్మూర్
104 ఉద్యోగులు తమ సమస్యల పై హైదరాబాద్ లో ముఖ్యమంత్రి రేవత్ రెడ్డి, హెల్త్ మినిస్టర్ దామోదర రాజనర్సింహను గురువారం కలిశారు. 16 సంవత్సరాలనుండి 104 ఉద్యోగులుగా ఉన్న మమ్మల్ని కనీసం కాంట్రాక్టు లేదా రెగ్యులర్ ఉద్యోగులుగు గుర్తించాలని, ఉద్యోగ భద్రత కల్పిస్తూ నెల నెలా జీతాలు వచ్చేలా చేయాలని విన్న వించారు. సమస్యలను తెలుసుకొని సానుకూలంగా స్పందిస్తూ పరిశీలించాలని సెక్రెటరీకి తెలిపారు. కార్యక్రమంలో యస్వాద ప్రకాష్, కృష్ణ, కృష్ణ, ప్రకాష్, ప్రవీణ్, పురుషోత్తం, రమేష్ ,104 సిబంది పాల్గొన్నారు.

విద్యార్థులకు సన్మానం


విద్యార్థులను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్
పదవ తరగతిలో ఉత్తమ మార్కులు సాధించిన 20 మంది విద్యార్థులను దళిత ఐక్య సంఘటన ఆధ్వర్యంలో సన్మానించి మెమెంటోను అందజేశారు. విద్యార్థులు చిన్నప్పటినుండి ఒక లక్ష్యాన్ని ఎంచుకొని ఆ దిశగా ముందుకు సాగితే జీవితంలో ఉన్నత స్థానంలో నిలబడతారని అప్పుడే కన్న తల్లిదండ్రులు ఆశలు, చదువు చెప్పిన గురువుల కలలు నెరవేరుతాయని తెలిపారు. అలాగే విద్యార్థులు కష్టంతో కాకుండా ఇష్టంతో చదివి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను ప్రేరణగా తీసుకొని చదువులోకి ముందుకెళ్లాలని తెలియజేశారు. ఈ సందర్భంగా సీనియర్ సంఘ సభ్యుడు పర్స లింబాద్రి ఒక్కో విద్యార్థికి రూ.1000 నగదును అందజేశారు. కార్యక్రమంలో దళిత ఐక్య సంఘటన నాయకులు సభ్యులు పాల్గొన్నారు.

అవగాహనతో కూడిన విద్య అవసరం

● ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి


నవీపేట్: విద్యార్థులకు నోట్‌బుక్స్ అందజేస్తున్న ఎమ్మెల్యే


డిచ్‌పల్లిలో...

నవతెలంగాణ- నవీపేట్/డిచ్‌పల్లి
ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మంచి అవగాహనతో కూడిన విద్య అవసరమని అన్నారు. మండల కేంద్రంలోని బాలికల ఉన్నత పాఠశాలలో బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి బడిబాటలో భాగంగా విద్యార్థులకు పాఠ్యపుస్తకాలు, స్కూల్ యూనిఫామ్‌లను గురువారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసేందుకు రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి 11వేల ఉపాధ్యాయ పోస్టులను భర్తీ చేయనున్నారని అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతి విద్యార్థికి 75శాతం కంటే ఎక్కువ మార్కులు వచ్చేలా ఉపాధ్యాయులు కృషి చేయాలని, ప్రతి మూడు నెలలకు ఒకసారి పాఠశాలలను తనిఖీ చేస్తానని ఈ సందర్భంగా తెలిపారు. జిల్లాలో 84,376 మంది విద్యార్థులకు పాఠ్యపుస్తకాలతో పాటు డ్రెస్సులను సకాలంలో అందించామని గత ప్రభుత్వం కంటే 25 రూపాయలు అదనంగా ఐకెపి మహిళలకు డ్రెస్సులను కుట్టడం కోసం ప్రభుత్వం అందిస్తుందని అన్నారు. కార్యక్రమంలో డిఆర్డిఏ పిడి, డిఈఓ దుర్గాప్రసాద్, ఆర్‌డిఓ రాజేందర్, ఎంపీపీ శ్రీనివాస్, ఎమ్మార్వో నారాయణ, ఎంపీడీవో నాగనాథ్, బుచ్చన్న, ఎంపీటీసీ మీనా నవీన్ రాజ్ మరియు ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు
డిచ్‌పల్లి : ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు ఉన్నాయని, తల్లిదండ్రులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించాలని డిచ్ పల్లి ఎంపీపీ నర్సయ్య అన్నారు. గురువారం మండలంలోని మెంట్రాజ్ పల్లి గ్రామంలో ఏకరూప దుస్తులు, పాఠ్య పుస్తకాల పంపిణీ కార్యక్రమం ప్రైమరీ పాఠశా లో ఏర్పాటు చేశారు.ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా ఎంపీపీ నర్సయ్య, వైస్ ఎంపీపీ సాయిలు, ఎంపిడిఓ రవీందర్, తహసిల్దార్ ప్రభాకర్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ పాఠశాలలో ఉత్తమమైన అధ్యాపకులచే విద్య బోధన చేస్తుందని, ఇదే కాకుండా ఏకరూప దుస్తులు, పాఠ్యపుస్తకాలు, మధ్యాహ్న భోజనం అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని ప్రతి ఒక్కరు సద్వినియోగం చేసుకుంటూ ప్రభుత్వ పాఠశాలలకు తమ పిల్లలను పంపే విధంగా చూడాలని సూచించారు. కార్యక్రమంలో ఎంపిటిసి సౌమ్య సుధీర్, సొసైటి చైర్మన్ శ్రీనివాస్ రెడ్డి, వైస్ చైర్మన్ నవీన్,ఎపిఎం రజిత రెడ్డి, ప్రధానోపాధ్యాయులు సంధ్య నాయక్, రాజ్య లక్ష్మి, సంగీత, చైర్ పర్సన్ లు ప్రమీల, సుగుణ, భాగ్య, నాయకులు ధర్మా గౌడ్, నరేందర్ రెడ్డి , శ్రీనివాస్ గౌడ్, ప్రభాకర్, రాజన్న శంకర్ తదితరులు పాల్గొన్నారు.

భగీరథ సర్వేను పరిశీలించిన డీఎల్పిఓ


సర్వేను పరిశీలిస్తున్న డీఎల్పిఓ

నవతెలంగాణ-మాక్లూర్
మండల కేంద్రంలో గ్రామ పంచాయతీ అధికారులు చేస్తున్న మిషన్ భగీరథ సర్వేను తీరును డివిజనల్ పంచాయతీ అధికారి శ్రీనివాస్ గురువారం పరిశీలించా రు. ఈ సందర్భంగా ఆయన మా ట్లాడుతూ సర్వేను సరిగా చేయాలని, రికార్డులు సక్రమంగా నిర్వహించాలని పంచాయతీ అధికారులకు తెలిపారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శి రాజేష్, ఎంపిటిసి వెంకటేశ్వర్ రావు, సిబ్బంది పాల్గొన్నారు.

ప్రతి బుధవారం 'విద్యుత్ ప్రజావాణి'

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ
ప్రతి బుధవారం 'విద్యుత్ ప్రజావాణి' ఉంటుందని జిల్లా విద్యుత్ శాఖ టీజీఎస్పీడీసీఎల్ సూపరింటెండెంట్ ఇంజనీర్ ఆర్ రవీందర్ గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. నిజామాబాద్ జిల్లా విద్యుత్ వినియోగదారులకు ప్రతి బుధవారం ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 1.30 నిమిషాల వరకు 'విద్యుత్ ప్రజా వాణి' నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యుత్ వినియోగదారులు విద్యుత్ మీటర్ మార్పుకునేందుకు, విద్యుత్ ఉత్పత్తిలో విద్యుత్ హెచ్చుతగ్గులు వోల్టేజ్ అయినప్పటికీ, విద్యుత్ బిల్లు లో వచ్చిన మార్పులకు, వ్యవసాయదారులకు ట్రాన్స్‌ఫార్మర్స్, ఇతర సమస్యలపై ప్రజావాణిలో ఫిర్యాదు చేసి పరిష్కారం పొందవచ్చని తెలిపారు. ఈ కార్యక్రమం ప్రతి బుధవారం వర్ని చౌరస్తా లో గల పవర్ హౌస్ కాంపౌండ్ లోని విద్యుత్ ప్రగతి భవన్ నందు విద్యుత్ ప్రజావాణి నిర్వహించనున్నట్టు పేర్కొన్నారు. నిజామాబాద్ వినియోగదారులు ఈ ప్రజావాణిలో పాల్గొని విద్యుత్ సంబంధిత సమస్యలను పరిష్కరించు కోవాలని అన్నారు.

రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో కుర్చీల వితరణ



కుర్చీలను అందజేస్తున్న రోటరీ క్లబ్ సభ్యులు


నవతెలంగాణ-ఆర్మూర్
రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో అధ్యక్షులు పట్వారి గోపికృష్ణ అధ్యక్షతన పిప్రి గ్రామంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో అవసరం నిమిత్తం గురువారం 10 కుర్చీలను అందజేశారు. ఈ సందర్భంగా అధ్యక్షుడు పట్వారి గోపి కృష్ణ మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ పాఠశాలలో ఇప్పటివరకు 100 కుర్చీలు 20 టేబుల్స్ వితరణ చేశామన్నారు. దీనికి స్పాన్సర్‌గా వ్యవహరించిన రోటరి మాజీ అధ్యక్షులు రాజ్ కుమార్ అగర్వాల్‌కి ధన్యవాదాలు తెలిపారు. రోటరీ సేవలు అభినందనీయమని వారికి ప్రధానోపాధ్యాయులు విశ్వనాథ్ ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో కోశాధికారి లక్ష్మీనారాయణ, మాజీ అధ్యక్షులు పుష్పకరావు, ప్రవీణ్ పవార్, సభ్యులు గోనె దామోదర్, ఉపాధ్యాయులు గట్టడి ఆనంద్ వేణుగోపాల్, శ్రీనివాస్, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పార్టీ నాయకురాలు కుటుంబానికి సునీల్‌రెడ్డి పరామర్శ

నవతెలంగాణ-భీంగల్
భీంగల్ పట్టణ కేంద్రానికి చెందిన కాంగ్రెస్ పార్టీ మహిళా నాయకురాలు కల్పన కుటుంబాన్ని పార్టీ నియోజకవర్గ ఇంచార్జి ముత్యాల సునీల్ రెడ్డి పరామర్శించారు. కల్పన తల్లి బుధవారం మృతి చెందింది. విషయం తెలుసుకున్న సునీల్ రెడ్డి గురువారం వారి కుటుంబాన్ని పరామర్శించి ప్రగాఢ సానుభూతి వ్యక్తం చేశారు. ఈయన వెంట సునీల్ యువసేన నాయకులు ఉన్నారు.

సిలబస్ సకాలంలో పూర్తి చేయాలి

● రిజిస్ట్రార్ ఎం.యాదగిరి


మాట్లాడుతున్న రిజిస్ట్రార్ యాదగిరి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
సిలబస్ సకాలంలో పూర్తి చేయాలని రిజిస్ట్రార్ ఎం.యాదగిరి అన్నారు. వేసవి సెలవుల అనంతరం తెలంగాణ యూనివర్సిటీ లో గురువారం విభాగాధిపతుల సమావేశంలో రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం.యాదగిరి ముఖ్యఅతిథిగా హాజరై సిలబస్‌ను సకాలంలో పూర్తి చేయాలని పేర్కొన్నారు. ఇంటర్నల్ మార్క్స్, ప్రాక్టికల్స్, థియరీ ఎగ్జామ్స్ అల్మానకు అనుసరించి నిర్వహించాలన్నారు. తరగతి గదిలో సృజనాత్మకతను పెంచే కార్యక్రమాలను నిర్వహిస్తూ విద్యార్థులలో విశ్లేషణాత్మక జ్ఞానాన్ని పెంపొందించాలని పేర్కొన్నారు. కార్యక్రమంలో కంట్రోలర్ ప్రొఫెసర్ అరుణ, విభాగాధిపతులు, ప్రొఫెసర్ సిహెచ్ ఆంజనేయులు, ప్రొఫెసర్ మూసాకురేష్, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ అడికే నాగరాజు, డాక్టర్ బ్రమరాంబిక, డాక్టర్ శాంతాబాయి, డాక్టర్ లక్షణ చక్రవర్తి, డాక్టర్ శిరీష, డాక్టర్ జమీల్ అహ్మద్, డాక్టర్ ఏ పున్నయ్య డాక్టర్ రమణాచారి తదితరులు పాల్గొన్నారు.

సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవాలి

● ఎంపీడీవో సంతోష్‌కుమార్


పరిశీలిస్తున్న ఎంపీడీవో

నవతెలంగాణ-భీంగల్ రూరల్/భీంగల్
సీజనల్ వ్యాధులు ప్రబలకుండా చర్యలు తీసుకోవా లని ఎంపీడీఓ సంతోష్ కుమార్ అన్నారు. మండలంలోని దేవన్‌పల్లి గ్రామంలో సీజనల్ వ్యాధులు అంటు రోగాల నివారణపై గ్రామస్థాయి ప్రజా ప్రతినిధులు సిబ్బందితో సమీక్ష సమావేశం గురువారం నిర్వహించారు.
వర్షాకాలం లో వ్యాధులు ప్రభలే అవకాశం ఉన్నందున ఇంటింటి సర్వే చేసి ఇళ్లలో నిలువ ఉన్న వాటర్ ని తొలగించాలన్నారు. గ్రామంలో పారిశుధ్య చర్యలు చేపట్టి యాంటీ లార్వా స్ప్రె చేయాలని, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సాయం త్రం దోమల నివారణకు ఫాగ్గింగ్ చేయాలని కోరారు.
భీంగల్ : వర్షాకాలంలో ప్రబలే సీజనల్ వ్యాధుల పట్ల ప్రజలకు అవగాహన కల్పించాలని ఎంపీడీవో సంతోష్ కుమార్ సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలో పంచాయతీ పంచాయతీ కార్యదర్శులు, కారో బార్లు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లతో సమీక్ష సమావేశం నిర్వహించారు. వర్షాకాలంలో సీజనల్ వ్యాధులు ప్రబలే అవకాశాలు ఉన్నందున ప్రజలను ముందుగా వాటి నుండి కాపాడుకునేందుకు అవగాహన కల్పించాలని తెలిపారు. అలాగే ప్రతి ఒక్కరు వ్యక్తిగత పరిశుభ్రతను పాటించడంతోపాటు పరిసర ప్రాంతాలను పరిశుభ్రంగా ఉంచే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు.

చైర్మన్, వైస్ చైర్మన్‌కు సన్మానం

నవతెలంగాణ-మోపాల్
మోపాల్ సొసైటీ చైర్మన్ గంగారెడ్డిని, నూతనంగా ఎన్నికైన వైస్ చైర్మన్ తిరుపతిని గురువారం సన్మానించారు. సొసైటీ మాజీ డైరెక్టర్ బాదావత్ సదా సింగ్ నాయక్, గుడితాండ గ్రామ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు కేతావత్ సురేష్ నాయక్ శాలువాతో సన్మానించారు.


సన్మానించిన పలువురు

రసాయన శాస్త్ర విభాగంలో

రాధిక మోరేకు డాక్టరేట్ ప్రదానం


రాధికను సన్మానిస్తున్న పలువురు

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీ రసాయన శాస్త్ర విభాగంలో పరిశోధక విద్యార్థిని రాధిక మోరే డాక్టర్ జీ.బాలకృష్ణన్ పర్యవేక్షణలో "డిజైన్, సింతసిస్ అండ్ బయోలాజికల్ ఎవల్యూషన్ ఆఫ్ పైరిడిన్, పైపరజిన్ మరియు ఫినైల్ ప్రొపైయోనిక్ ట్రయజోల్ ఎనలాగ్స్ అస్ యాంటీ క్యాన్సర్ అండ్ యాంటీ మైక్రోబైల్ ఏజెంట్" అనే అంశంపై పరిశోధన జరిపారు. గురువారం జరిగిన బహిరంగ మౌఖిక పరీక్షకు ఎక్స్టర్నల్ ఎగ్జామినల్ గా ప్రొఫెసర్. వై. శ్రీనివాస్ రావు డిపార్ట్మెంట్ ఆఫ్ కెమిస్ట్రీ సెంట్రల్ యూనివర్సిటీ హైదరాబాద్ హాజరై పరిశోధన సిద్ధాంత గ్రంథంపై విస్తృతమైన ప్రశ్నలు లేవనెత్తారు.
పరిశోధకురాలు అన్ని ప్రశ్నలకు ప్రయోగాత్మకమైన ఉదాహరణలతో సమాధానాలు ఇచ్చారు. ఈ పరిశోధన క్యాన్సర్, యాంటీబ యోటిక్స్ మందుల యొక్క పురోగతికి దోహదపడుతుందని రాధిక మోరే తెలిపారు. రాధిక అందించిన జవాబులకు ఆచార్యులు సంతృప్తి వ్యక్తం చేసి పీహెచ్డీ డిగ్రీకి ఆమోదం తెలిపారు.
ఈ మౌఖిక పరీక్షలో రసాయన శాస్త్ర విభాగ అధిపతి డాక్టర్ నాగరాజు, ప్రిన్సిపల్ సిహెచ్ ఆరతి, కంట్రోల్ ఆఫ్ ఎగ్జామ్ డాక్టర్ అరుణ, రసాయన శాస్త్ర అధ్యాపకులు డాక్టర్ డాక్టర్ సాయిలు, డాక్టర్ నాగరాజు, డాక్టర్ డేనియల్, డాక్టర్ నాగేంద్రబాబు, డాక్టర్ సురేష్, డాక్టర్ అబ్దుల్ కవి, డాక్టర్ మహేందర్, డాక్టర్ ప్రవీణ్ మామిడాల, డాక్టర్ సంపత్ కుమార్, డాక్టర్ రఘువీర్, డాక్టర్ గంగాధర్ పరిశోధక విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

హాస్టల్స్‌లో పరిశుభ్రత పాటించాలి

నవతెలంగాణ-డిచ్‌పల్లి
తెలంగాణ యూనివర్సిటీలో రిజిస్ట్రార్ ఛాంబర్ లో చీఫ్ వార్డెన్ డాక్టర్ మహేందర్ ఐలేని అధ్యక్షతన హాస్టల్ వార్డెన్స్, కేర్టేకర్స్‌తో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా రిజిస్ట్రార్ ప్రొఫెసర్ డాక్టర్ ఎం. యాదగిరి మాట్లాడుతూ.. వేసవి సెలవులు అనంతరం విద్యార్థులు యూనివర్సిటీకి హాజరవుతున్నారని హాస్టల్లో పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని పేర్కొన్నారు. హాస్టల్ గదులను శుభ్రంగా ఉంచాలని, పరిశుభ్రమైన నీటిని అందించాలని భోజనం రుచిగా సుచిగా ఉండాలని ఆదేశించారు. కార్యక్రమంలో వార్డెన్ డాక్టర్ కిరణ్ రాథోడ్, డాక్టర్ గంగా కిషన్, డాక్టర్ కిరణ్మై, కేర్ టేకర్లు తదిత రులు పాల్గొ న్నారు.

ప్రైవేటు పాఠశాలల ఫీజులపై నియంత్రణ చట్టం తీసుకురావాలి

● ప్రభుత్వ పాఠశాలల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలి
● పిడిఎస్‌యూ

నవతెలంగాణ-డిచ్‌పల్లి
ప్రభుత్వ విద్యా సంస్థల్లో మెరుగైన సౌకర్యాలు కల్పించాలని, ప్రైవేట్ స్కూల్లో ఫీజుల నియంత్రణ చట్టం తీసుకురావాలని పిడిఎస్‌యూ డిచ్ పల్లి మండల నాయకులు వరుణ్ అన్నారు. గురువారం తహసిల్దార్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ పాఠశాలల్లో ఖాళీగా ఉన్న ఉపాధ్యాయ పోస్టులు భర్తీ చేయాలని, పుస్తకాలు సకాలంలో ఇవ్వాలని, తాగునీరు కొరత లేకుండా చూడాలని, విద్యార్థులకు సరిపడా టాయిలెట్స్, క్లాస్ రూం లు నిర్మించాలని అన్నారు. ప్రవేట్ పాఠశాలల్లో ఫీజులను నియంత్రించడానికి ఫీజుల నియంత్రణ చట్టం ప్రభుత్వం వెంటనే తీసుకురావాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో నాయకులు రవీందర్, అఖిల్ తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న పీడీఎస్‌యూ నాయకులు

IN THE COURT OF THE HON'BILE PRL-JUNIOR CIVIL JUDGE AT: NIZAMABAD
O.S NO. 433 OF 2023
Between:-
Kolla Gopala Krishna Murthy S/o Subbarayudu, Age 80 Yrs, Occ: Agriculture, R/o H.No.6-88, Dharmaram (B) Dichpally (M), Nizamabad (Dist).
...Plaintiff
And
Velmala Srinu S/o Abbaiah, Age 40 Yrs, Occ: Agriculture, R/o H.No.6-90/1, Dharmaram (B) Village, Dichpally (M), Nizamabad (Dist).
...Defendant
To,
Whom so ever it may concern.
It is informed you that the above named Petitioner filed the above O.S No.433 of 2023 against Respondents **UNDER SECTION 26 ORDER VII RULE 1 OF C.P.C** and the same is posted to **26.06.2024** for your appearance at 10.30 A.M before Hon'ble Senior Civil Judge, at Nizamabad, anybody have an objection in this regard they must approached either in person or through your duly instructed Advocate. If you do not appear the matter will be decided on merits.
// BY ORDER OF THE COURT //
YERRAM SADANANDAM
ADVOCATE, Nizamabad

IN THE COURT OF THE HON'BLE SPL. JUDGE FOR SC/ST CASES. CUM. IInd ADDL. DISTRICT JUDGE AT NIZAMABAD
A.S. No. 19 of 2023
Between:-
1. Jinna Raju W/o Late Jinna Rajeshwar, Aged 42 Years, Occ: Agriculture, R/o Kammarpally Village and Mandal, Dist. Nizamabad.
2. Jinna Raj Kumar S/oLate Jinna Rajeshwar, Aged about 24 Years, occ: Agriculture, R/o Kammarpally Village and Mandal, Dist. Nizamabad.
..Appellants /Defendants
And
Renjarla Bajaiah S/o Late Renjarla Yerra Bhumanna, Aged 43 Years, Occ: Private Employee, R/o Uploor Village of Kammarpally Mandal, Dist. Nizamabad.
...Respondent / Plaintiff
To,
Renjarla Bajaiah S/o Late Renjarla Yerra Bhumanna, Aged 43 Years, Occ: Private Employee, R/o Uploor Village of Kammarpally Mandal, Dist. Nizamabad.
Whereas the Appellants / Defendants have preferred an appeal U/O. 41 Rule 1 of C.P.C. aganist you and same was posted for your appearance & hearing on **08-07-2024**
Take notice that in the above case, if any objections or claims for above appeal, you are directed to appear before this hon'ble court on **08-07- 2024 at 10:30 A.M.** either in person or through a counsel duly authorized, failing which the above subjected matter will be heard and decided as per law.
// BY ORDER OF THE COURT //
E. Bhagee Charan
Advocate, Nizamabad

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT NIZAMABAD
ABR No. 103 of 2024
Between:-
M/s. Mahija Chit Fund (Indur) Pvt. Ltd., Nizamabad represented by its Foreman Mr.B.Komaraiah
..Disputant
And
Mohd Abdul Jaffar and others
To,
Opp.1 Mohd Abdul Jaffar S/o.AbdulSattar, aged about 37 years, Occ: Service, Asst (Works), South Central Railway, Nizamabad. Cell:9848810266.
Opp.2 Ibrahim Khan S/o. Osman khan, aged about 45 years, Occ: Service Asst (Works), South Central Railway, Nizamabad. Cell: 9866475597.
Opp.3 Wilson Frazer S/o. AntonyFrazer, aged about 35 years, Occ: Service, Asst (Works), South Central Railway, Nizamabad. Cell: 7989003548.
Opp.4 Rathod Ravinder S/o. Kishan Singh, aged about 40 years, Occ: Service, Asst (Works), South Central Railway, Nizamabad. Cell:9346138650.
Opp.6 Goutham P N Lobha S/o.Pawale NarobaLobha, aged about 53 years, Occ: Service, Technician (Power)-1, South Central Railway, Nizamabad. Cell: 9494629129.
The Disputant has filed the dispute for recovery of amount and notices sent on your addresses are returned unserved. Whereas the dispute is posted for your appearance on **19.06.2024 at 11.00 A.M.** You are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits/Arbitrator, Nizamabad on the said date failure of which the dispute will be heard and decided exparte.
// By Order of the Deputy Registrar of Chits/Arbitrator //
Sd/-
Deputy Registrar of Chits/Arbitrator,
Kavitha Complex, Nizamabad.

BEFORE THE HON'BLE DEPUTY REGISTRAR OF CHITS/ARBITRATOR AT NIZAMABAD
ABR No. 102 of 2024
Between:-
M/s. Mahija Chit Fund (Indur) Pvt. Ltd., Nizamabad represented by its Foreman Mr.B. Komaraiah
..Disputant
And
Purohith Madan and others.
.. Opponents
To,
Opp.1 Purohith Madan S/o. Bawar Singh @ Bhawar Singh, aged about 25 years, Occ: Business, R/o.H.No.1-1-26/41/1/2/2, Journalist Colony, Po & Mdl: Armoor Dist: Nizamabad.Cell:7013285009.
Opp.2 Masani Ganga Reddy S/o.Vittal Reddy, aged about 45 years, Occ: Service, R/o.H.No.6-2-160, SBH Lane, Subhash Nagar, Nizamabad.Cell:9441667359.
Opp.4 RajPurohith Gotham S/o. RajPurohit Bhawarlal @ Bawar Singh, aged about 31 years, Occ: Business, R/o.H.No.3-1-18/3,Saidabad Colony, Po&Mdl: Armoor, Dist: Nizamabad. Cell: 9703252561.
Opp.5 RajPurohith Narpathlal, S/o. Rajpurohit Bhawar @ Bawar Singh, aged about 36 years, Occ Business,R/o. H.No.1-1-26/41/1/2/2, Journalist Colony, Po & Mdl: Armoor Dist: Nizamabad.Cell:868686007.
Opp.6 Smt Raj Purohith Manjul Devi,S/o. Raj Purohith Narpathlal, aged about 35 years, Occ: Business, R/o.H.No.1-1-26/41/1/2/2, Journalist Colony, Po & Mdl: Armoor Dist: Nizamabad. Cell: 8686860077.
The Disputant has filed the dispute for recovery of amount and notices sent on your addresses are returned unserved. Whereas the dispute is posted for your appearance on **19.06.2024 at 11.00 A.M.** You are called upon hereby to appear in person before the Hon'ble Deputy Registrar of Chits/Arbitrator, Nizamabad on the-said date failure of which the dispute will be heard and decided exparte..
// By Order of the Deputy Registrar of Chits/Arbitrator //
Sd/-
Deputy Registrar of Chits/Arbitrator,
Kavitha Complex, Nizamabad.

నవతెలంగాణ
సమగ్ర తెలుగు దినపత్రిక
నిజామాబాద్-కామారెడ్డి
శుక్రవారం | జూన్ 14, 2024 | www.navatelangana.com

న్యాయవాదికి సన్మానం



నవతెలంగాణ-ఆర్మూర్

న్యాయవాద బార్ అసోసియేషన్ అధ్యక్షులు జగన్మోహన్ గౌడ్ తెలంగాణ రాష్ట్ర న్యాయవాద ఫెడరేషన్ ఉపాధ్యక్షులుగా నియమించినందుకు జిల్లాలోని న్యాయవాద బార్ కార్యాలయం నందు ప్రముఖ న్యాయవాది, న్యాయవాద బార్ అసోసియేషన్ మాజీ సంయుక్త కార్యదర్శి జెస్సు అనిల్ కుమార్ ఆధ్వర్యంలో గురువారం శాలువాతో సన్మానించారు. కార్యక్రమంలో అసోసియేషన్ మాజీ అధ్యక్షులు రాజ్ కుమార్ సుబేదార్, ఉపాధ్యక్షులు రాజు, ప్రధాన కార్యదర్శి వసంతరావు, గ్రంథాలయ కార్యదర్శి పిల్లి శ్రీకాంత్, నారాయణదాసు, మాణిక్ రాజ్, రవి, రఘువీర్, శ్రీమన్, సాహితీ తదితర న్యాయవాదులు పాల్గొన్నారు.

మైనారిటీ అభ్యర్థులకు గ్రూప్-2,3కి ఉచిత శిక్షణ

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

తెలంగాణ రాష్ట్ర మైనారిటీస్ స్టడీ సర్కిల్, మైనారిటీల సంక్షేమ శాఖ, హైదరాబాద్ వారు మైనారిటీస్ అభ్యర్థులకు గ్రూప్-2, 3 సర్వీసెస్ ఎగ్జామినేషన్ కొరకు ఉచిత శిక్షణ అందించనున్నట్టు నిజామాబాద్ జిల్లా మైనారిటీ సంక్షేమశాఖ అధికారి కే. కృష్ణవేణి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. డిగ్రీ పూర్తి చేసుకున్న మైనారిటీ అభ్యర్థుల నుంచి దరఖాస్తులను ఆహ్వానిస్తున్నామని, ఈ ఉచిత శిక్షణ (45) రోజులు ఉంటుందని పేర్కొన్నారు. అర్హత కలిగిన మైనారిటీ (ముస్లిం, క్రైస్తవులు, సిక్కులు బౌద్ధులు, జైనులు, పార్సికులు) అభ్యర్థులు తమ దరఖాస్తులను ఈనెల 18 లోగ ఉర్దూ అకాడమీ (ఉర్దూ ఘర్) అహ్మది బజార్ నిజామాబాద్ నందు సమర్పించాలని తెలిపారు. దరఖాస్తుతో పాటు ఆధార్ కార్డ్, ఎస్ఎస్‌సి, ఇంటర్, డిగ్రీ మార్కుల మెమోలు, గ్రూప్స్‌కు దరఖాస్తు చేసుకున్న రిజిస్ట్రేషన్ కాపీ, పాస్ పోర్ట్ సైజ్ ఫొటో కాపీలు-2, జతపరచాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9948956994, 9700351786 లను సంప్రదించాలని పేర్కొన్నారు.

స్కూల్ యూనిఫాంలు అందజేత



యూనిఫాంలు అందజేస్తున్న పలువురు

నవతెలంగాణ-భీంగల్‌రూరల్

భీంగల్ మండలంలోని కుప్పకంటి, పెద్దమ్మ కాడి తండా గ్రామాల్లో ఐకేపీ ఆధ్వర్యంలో విద్యార్థులకు స్కూల్ యూనిఫామ్స్ ఎంపీటీసీలు, ఐకెపి సిబ్బంది గురువారం పంపిణీ చేశారు. ఈసందర్భంగా ఐకెపి సీనియర్ సిసి పురస్తు నరేష్ మాట్లాడుతూ.. భీంగల్ మండలం పెద్దమ్మ కాడి తండా కుప్పకంటి గ్రామాల్లో ఐకెపి మహిళా సంఘ సభ్యుల ద్వారా డ్రెస్సులు కుట్టించి విద్యార్థిని. విద్యార్థులకు పంపిణీ చేయడం జరుగుతుందని తెలిపారు. ఎంపీటీసీలు చిన్నోళ్ల సుమలత, లక్ష్మి మాట్లాడుతూ.. ఐకెపి ద్వారా మహిళా సంఘ సభ్యులందరికీ ఉపాధి కల్పించి స్కూల్ విద్యార్థులకు అందరికీ డ్రెస్సులు కుట్టించడం చాలా సంతోషకరమన్నారు. కాంగ్రెస్ నాయకులు నారాయణ రమేష్ మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి మహిళలకు ఉపాధి కల్పించి విద్యార్థులకు డ్రెస్సులు కుట్టించడం చాలా సంతోషమని అన్నారు. కార్యక్రమంలో సీనియర్ సిసి పురస్తు నరేష్, ఎంపిటిసిలు చిన్నోళ్ల సుమలత, రాజేశ్వర్, సికింద్రాపూర్ ఎంపిటిసి లక్ష్మి, కాంగ్రెస్ నాయకులు నారాయణ రమేష్, లావుడియా, రమేష్, అధ్యక్షురాలు రజిని వివోఏలు కమల రత్నాకర్, గ్రామ సెక్రెటరీలు, హెడ్ మాస్టర్లు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

డిచ్‌పల్లి యూత్ కాంగ్రెస్ మండల అధ్యక్షునిగా గురజాల సతీష్ రెడ్డి



నియామకపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే

నవతెలంగాణ-డిచ్‌పల్లి

తెలంగాణ యువజన కాంగ్రెస్ అధ్యక్షుడు శివసేనారెడ్డి సూచనల మేరకు డిచ్‌పల్లి మండల యూత్ కాంగ్రెస్ అధ్యక్షునిగా మండలంలోని బర్ధిపూర్ గ్రామానికి చెందిన గురజాల సతీష్ రెడ్డి నియమించారు. గురువారం రాత్రి ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ రేకులపల్లి భూపతిరెడ్డి సతీష్ రెడ్డికి నియామక పత్రం అందజేశారు. ఏఐసిసి అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, రాష్ట్ర అధ్యక్షులు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి దార్శనికత గల నాయకులని, కాంగ్రెస్ పార్టీని మరింత బలోపేతం చేసేందుకు ప్రత్యేకంగా కృషి చేస్తారన్న నమ్మకం ఉందని అన్నారు. పార్టీ బలోపేతానికి కృషి చేయాలని సూచించారు. ఈ నియామకం యూత్ రాష్ట్ర ఉపాధ్యక్షులు, జిల్లా ఇంఛార్జి రామర్తి గోపి, జిల్లా అధ్యక్షులు జె. విఘ్నేష్ యాదవ్ సూచనల మేరకు నియామకం జరిగిందని వివరించారు. ఈ కార్యక్రమంలో టిపిసిసి డెలిగేట్ శేఖర్ గౌడ్, రూరల్ యూత్ అధ్యక్షులు ఉమ్మజి నరేష్, తదితరులు పాల్గొన్నారు.

టోల్ చార్జీల పెంపు సరికాదు

- మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు నాగరాజ్ గౌడ్

నవతెలంగాణ-కామారెడ్డి

కేంద్ర ప్రభుత్వం టోల్ గేట్ ఛార్జీలు మూడు నుంచి ఐదు శాతం పెంచడం శోచనీయమని మండల రైతుబంధు సమితి మాజీ అధ్యక్షులు అంకన్నగారి నాగరాజ్ గౌడ్ అన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని టోల్ ఛార్జీల పెంపును వాయిదా వేసిన కేంద్రం ఎన్నికలు ముగియడంతో ఈ నెల 3 నుంచి టోల్ చార్జీలను పెంచుతూ ఆదేశాలు జారీ చేయడం సమంజసం కాదన్నారు. కేంద్ర ప్రభుత్వం ఎన్నికల్లో లబ్ధి పొందడానికి ఎన్నికల వరకు వేచి ఉండి చివరి దశ ఎన్నికలు పూర్తయిన వెంటనే వినియోగదారుల రుసుము రేట్ల సవరణ అమలులోకి తీసుకురావడం కేంద్ర ప్రభుత్వానికి తగదన్నారు. టోల్ ఛార్జీల పెంపుతో రవాణా రంగంపై , ముఖ్యంగా రైతుల పై పెను ప్రభావం పడుతుందన్నారు. ఇప్పటికే సామాన్య ప్రజలపై భారం పడుతోందని మళ్ళీ టోల్ గేట్ చార్జీలు పెంచడంతో మరింత భారం పడి రవాణా చేసే నిత్యావసర వస్తువులు, ప్రతి వస్తువు చార్జీలు పెరిగే అవకాశం ఉంటుందన్నారు. కేంద్ర ప్రభుత్వం పునరాలోచించి పెంచిన టోల్గేట్ చార్జీలను సత్వరమే ఉపసంహరించుకోవాలన్నారు.

డీజిల్ దందాపై విజిలెన్స్ విచారణ చేపట్టాలి

- 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు

నవతెలంగాణ-గోదావరిఖని

రామగుండం కార్పొరేషన్ అవినీతికి పరాకాష్టగా మారిందని 25వ డివిజన్ కార్పొరేటర్ నగునూరి సుమలత రాజు ఆరోపించారు. దీనికి నిదర్శనంగా గురువారం ఓ సంఘటన చోటు చేసుకుందని తెలిపారు. గత కొద్దిరోజులుగా రామగుండం కార్పొరేషన్‌లో డీజిల్ దందా బాగోతంపై ఆరోపణలు వస్తున్న నేపథ్యంలో అందుకు నిదర్శనంగా గోదావరి డంపింగ్ యార్డ్ వద్ద పెట్రోల్ లేక వాహనం నిలిచిపోయిందని తెలిపారు. పారిశుధ్య వాహనాలలో డీజిల్ తక్కువ పోస్తూ... రికార్డుల్లో ఎక్కువ రాస్తూ చేతివాటం ప్రదర్శిస్తున్న సదరు సెక్షన్ అధికారి వ్యవహారంపై ఆగ్రహం వ్యక్తం చేశారు. డీజిల్ దందాపై విజిలెన్స్ విచారణకు డిమాండ్ చేశారు.

అనుమతి లేదు.. భవనం పూర్తికాలే ..

- జోరుగా అడ్మిషన్లు
- పట్టించుకోని విద్యాశాఖ
- చర్యలు తీసుకోవాలంటున్న విద్యార్థిసంఘాలు
- విద్యార్థుల తల్లిదండ్రుల ఆగ్రహం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

విద్యార్థులను అడ్మిషన్ చేసే సమయానికి ముందుగానే తల్లిదండ్రులు పాఠశాలకు అనుమతి ఉందో లేదో ఎంఈఓ కార్యాలయంలో తెలుసుకొని అడ్మిషన్లు చేయించుకోండి అని జిల్లా విద్యాశాఖ అధికారి చెబుతున్నారు. మరోవైపు ప్రైవేట్ విద్యా సంస్థల వారు మాత్రం ఇష్టానుసారంగా వ్యవహరిస్తూ ప్రకటనలు, ప్రచారాలు ముమ్మరంగా కొనసాగిస్తున్నారు. విద్యాశాఖ అధికారులకు మాత్రం కనపడనట్టు, వినపడనట్టు వ్యవహరిస్తున్నారని విద్యార్థి సంఘాల నాయకులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఏమైనా అంటే జిల్లా విద్యాశాఖ అధికారి విద్యార్థుల తల్లిదండ్రులు బాధ్యతలు తీసుకొని విద్యా సంస్థకు అనుమతి ఉందా... లేదా.... అని తెలుసుకొని అడ్మిషన్లు చేసుకోవాలని అంటున్నారు. విద్యాశాఖ అధికారులకు ఏమాత్రం బాధ్యత లేదు అనే విధంగా.. పట్టనట్టుగా వ్యవహరిస్తూ, విద్యాసంస్థను సందర్శించకుండా.. ప్రచారాలను, ప్రకటనలో ఆపివేయకుండా ఎటువంటి చర్యలు తీసుకోవడం లేదని విద్యార్థి సంఘాల నాయకులు, విద్యార్థులు, తల్లిదండ్రులు ఆరోపణలు చేస్తున్నారు. నగరంలో అమ్మ వెంచర్‌లో ఓ ఇంటర్నేషనల్ పాఠశాల భవనం పనులు ఇంకా పూర్తికలేదు. ఈ విద్యా సంవత్సరం ఈనెల 12 నుండే ప్రారంభమైంది. ఆ పాఠశాల మాత్రం ఈనెల 20 నుండి ప్రారంభిస్తామని సమాచారం అందిస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు చెబుతున్నారు. ఈ భవనమే పూర్తి కాకుండా ప్రచారాన్ని మాత్రం 3,4 నెలలుగా చేస్తున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు అంటున్నారు. ఇంత హడావిడిగా ఈ భవనాన్ని నిర్మిస్తే అది నాణ్యత ఉంటుందో లేదో అని తల్లిదండ్రులు భయాందోళనకు గురవుతున్నారు. ఒక సంవత్సరం ముందుగానే భవనాన్ని నిర్మించి ఉంటే బాగుండేదని విద్యార్థి సంఘాల నాయకులు అంటున్నారు. ఇప్పటికైనా జిల్లా విద్యాశాఖ అధికారులు ఎటువంటి భవనం పూర్తి కాకుండానే అడ్మిషన్లు చేస్తున్న, ప్రచారం చేస్తున్న పాఠశాలను సందర్శించి చర్యలు తీసుకోవాలని విద్యార్థుల తల్లిదండ్రులు కోరుతున్నారు.



గ్రామకార్యదర్శుల ఇష్టారాజ్యం

- ఇబ్బందులకు గురవుతున్న ప్రజలు
- మండల స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లినా.. పట్టించుకోని వైనం

నవతెలంగాణ-ధర్పల్లి

మండలంలోని కొన్నిపంచాయతీ కార్యదర్శుల వ్యవహారం తారాస్థాయికి చేరినట్లు కనిపిస్తుంది. ప్రజలు తమ సమస్యలపై కార్యాలయానికి వచ్చిన స్పందించకుండా వ్యవహరిస్తున్నట్లు తెలుస్తుంది. గ్రామాల్లో కొందరు అయినవారికి అడిగినంతగా స్థలంలో ఇంటి నిర్మాణాలు అనుమతులు ఇస్తున్నారు. మరికొందరు అమాయక ప్రజలు ఇంటి నిర్మాణానికి అనుమతులు కోరితే అనేక వంకలు పెడుతూ కార్యదర్శులే చుట్టు పక్కలవారితో సమస్యలు సృష్టిస్తూ ఇబ్బందులకు గురి చేస్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి. మరికొందరు నూతన గృహ నిర్మాణాలు చేపట్టేవారికి ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తూ ఒకరికి ఒకలాగా, మరొకరికి మరోలా బెదిరింపులకు పాల్పడుతూ అమాయక ప్రజలకు ఆందోళనలోకి నెట్టేస్తున్నారు. దీంతో అమాయక ప్రజలు చేసేదేమిలేక మండలస్థాయి అధికారులకు తమగోడు చెప్పుకున్న పట్టించుకునే నాధుడు కరువయ్యారని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. దీనంతటికి కారణం గ్రామాల్లో సర్పంచులు లేకపోవడంతో వారు ఆడిందే ఆట పాడిందే పాటగా గ్రామపాలనా కొనసాగుతుంది. మరికొందరు కార్యదర్శులు అందుబాటులో లేకపోవడంతో ఫోన్ చేయగా తప్పించుకునే సమాధానాలు చెప్తున్నారు. సమస్యలకు పరిష్కారం చూపాల్సిన అధికారులు ఇలా చేస్తున్నారని, మండల స్థాయి అధికారుల ముందు మొరపెట్టుకుందామని వెళితే చూస్తా.. చెపుతాం.. అనే సమాధానాలు వస్తున్నాయని ప్రజలు వాపోతున్నారు. మరికొందరు తమ సమస్యలు పరిష్కారానికి జిల్లా పంచాయతీ అధికారుల దృష్టికి తీసుకెళ్లగా సదరు కార్యదర్శులపై ఉన్నత అధికారులు పలు మార్లు ఆగ్రహించినప్పటికీ కార్యదర్శుల్లో మార్పు రావడంలేదని విమర్శలు వినిపిస్తున్నాయి. జిల్లా స్థాయి అధికారులు కొందరు కార్యదర్శుల పనితీరుపై పరిశీలించి, వారి ప్రవర్తనలో మార్పు చేకూర్చేందుకు చర్యలు చేపట్టాలని ఆయా గ్రామాల ప్రజలు కోరుతున్నారు.

పాఠశాలల్లో పుస్తకాలు పంపిణీ

నవతెలంగాణ-కామారెడ్డి

కామారెడ్డి జిల్లా పాల్వంచ మండలం భవానీపేట గ్రామంలో గల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గ్రామ ఎంపీటీసీ రాజానర్సు చేతుల మీదుగా గురువారం ప్రభుత్వ పాఠశాలలో చదువుకుంటున్న పిల్లలకు తెలంగాణ ప్రభుత్వం అందించే ఉచిత పుస్తకాలు పంపిణీ చేశారు. అనంతరం వారు మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో పిల్లలు అధిక సంఖ్యలో చేరాలని తెలంగాణ ప్రభుత్వం పాఠశాలలో పిల్లలకు ఉచిత పుస్తకాలు, మధ్యాహ్న భోజనంతో పాటు పిల్లలకు దుస్తులు, నాణ్యమైన విద్యను అందిస్తుందని తెలిపారు. ప్రతి ఒక్కరు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలలో చేర్పించాలన్నారు. కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు సూర్య ప్రకాష్, ఉపాధ్యాయులు బషీర్, లిగ్గారెడ్డి, సుధాకర్, లక్ష్మి, రాజన్, అరుణ, విజయ్, పాఠశాలలో చదువుతున్న పిల్లలు పాల్గొన్నారు.



పుస్తకాలు పంపిణీ చేస్తున్న ఎంపీటీసీ

జర్నలిస్టులపై దాడులను సహించం

- ప్రెస్‌క్లబ్ ఆధ్వర్యంలో డీసీపీకి ఫిర్యాదు

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

జర్నలిస్టులపై దాడులను సహించేదిలేదని నిజామాబాద్ ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు రామకృష్ణ, బైరి శేఖర్ అన్నారు. నందిపేట్ ప్రాంతంలో జర్నలిస్టుల పై దాడి చేసిన వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిసిపి కోటేశ్వర్ రావుకు గురువారం ఫిర్యాదు చేశారు. ఈ సందర్భంగా ప్రెస్ క్లబ్ అధ్యక్ష, కార్యదర్శులు మాట్లాడుతూ నల్ల మట్టి, మొరం అక్రమ తవ్వకాలు జరుగుతుందనే సమాచారం మేరకు వార్త సేకరణలో భాగంగా వెళ్లిన జర్నలిస్టులు కర్క రమేష్, శివ ఠాకూర్, గణేష్‌లపై కొందరు అక్రమార్కులు దాడికి యత్నించారని అన్నారు. కెమెర, కారు ధ్వంసం చేశారని డిసిపికి తెలిపారు. విచారణ చేపట్టి, చర్యలు తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో ప్రెస్‌క్లబ్ ఆర్గనైజింగ్ సెక్రటరీ మండే మోహన్, శివ, దేవదాస్, జైపాల్, హైమద్, బొంపల్లి రాజు, ఉమామహేశ్వర్, శివ ఠాకూర్, గణేష్, రమేష్, తదితర జర్నలిస్టులు పాల్గొన్నారు.



డీసీపికి వినతిపత్రం అందజేస్తున్న జర్నలిస్టులు

నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని చేపట్టాలి

- కలెక్టర్ ఆశిష్

నవతెలంగాణ-నిర్మల్

జిల్లాలో నులిపురుగుల నివారణ కార్యక్రమాన్ని పకడ్బందీగా చేపట్టాలని జిల్లా కలెక్టర్ ఆశిష్ సాంగ్వాన్ అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమ నిర్వహణకు తీసుకోవలసిన చర్యలపై సంబంధిత శాఖల అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా మాట్లాడారు. జిల్లాలో ఈ నెల 20న నిర్వహించనున్న జాతీయ నులిపురుగుల నియంత్రణ కార్యక్రమాన్ని అధికారులు సమన్వయంతో విజయవంతం చేయాలని ఆదేశించారు. 1-19 వయస్సు గల పిల్లలు జిల్లాలో 1,92,000 మంది ఉన్నారని, ప్రతి ఒక్కరికి నులిపురుగుల నివారణ మాత్రలను అందించాలని సూచించారు. నులిపురుగుల వలన పిల్లలలో కలిగే నష్టాలు, మాత్రలను వేసుకోవడం వలన కలిగే లాభాలను పాఠశాలలు, అంగన్వాడి కేంద్రాలు, కళాశాలలు, పట్టణ, గ్రామీణ ప్రాంతాలలో విస్తృతంగా అవగాహన కార్యక్రమాలు చేపట్టాలని ఆదేశించారు. విద్య, వైద్య, పంచాయతీ, శిశు సంక్షేమం, డిఆర్డిఓ శాఖల సమన్వయంతో నులి పురుగుల నియంత్రణకు వందశాతం పిల్లలకు మాత్రలను అందించాలని సూచించారు. సమావేశంలో డిఎంహెచ్ ధన్‌రాజ్, జడ్పి సీఈఓ గోవింద్, డిపిఓ శ్రీనివాస్, డిఈఓ రవీందర్ రెడ్డి, డిఆర్డిఓ విజయలక్ష్మి, డిడబ్ల్యుఓ నాగమణి పాల్గొన్నారు.

ఈదురుగాలులతో కూడిన వర్షం

నవతెలంగాణ-జూలపల్లి

జూలపల్లి మండలం వడ్కాపూర్, కాచాపూర్ గ్రామాల్లో ఈదురుగాలులతో కూడిన వర్షం కురిసింది. వర్షంతో వాడకాపూర్ గ్రామంలో ఓ ఇంటిలో రేకులు లేచిపోయి కరెంటు పోల్ స్తంభానికి చిక్కుకున్నాయి.దీంతో కరెంటుకి తీవ్ర అంతరాయం ఏర్పడింది. కొద్ది రోజులుగా ఉక్కపోతతో ఇబ్బందులు పడుతున్న ప్రజలకు వర్షం పడడంతో రైతులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

16న జిల్లా కబడ్డీ సంఘ సమావేశం

నవతెలంగాణ-ముప్కాల్

ఈ నెల16 ఆదివారం జిల్లా కబడ్డీ అసోసియేషన్ నూతన కార్యవర్గ సమావేశంను ఏర్పాటు చేస్తున్నట్లు జిల్లా కబడ్డీ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి కె.గంగాధర్ రెడ్డి గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇటీవల నూతనంగా 2024 నుంచి 2028 సంవత్సర కాల పరిమితికి ఎన్నుకోబడిన నిజామాబాద్ జిల్లా కబడ్డీ అసోసియేషన్ సంఘం యొక్క పాలక వర్గం, కార్యవర్గ సభ్యుల సమావేశం ఈ నెల16న ఉదయం 10 గంటలకు ముప్కాల్ మండల కేంద్రంలోని ముప్కాల్ స్పోర్ట్స్ అకాడమీ, క్రీడా ప్రాంగణంలో జిల్లా కబడ్డీ అసోసియేషన్ అధ్యక్షులు అంద్యాల లింగయ్య అధ్యక్షతన సమావేశం ఏర్పాటు చేసినట్టు తెలిపారు. ఈ సన్నాహక సమావేశంలో పలు ఎజెండా అంశాలపైన చర్చించి వాటిపై నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు. కావున జిల్లా నలుమూలల నుంచి పాలక వర్గం సభ్యులతో పాటు కార్యవర్గ సభ్యులందరు సకాలంలో హాజరుకావాలని విజ్ఞప్తి చేశారు..

జాతీయస్థాయి బాల సాహిత్య పురస్కారం అందుకున్న వైష్ణవి



నవతెలంగాణ-ఏర్గట్ల

మండలంలోని తడపాకల్ గ్రామానికి చెందిన బాల రచయిత్రి డేగల వైష్ణవి రచించిన "చిన్నారి కథలకు" శ్రీవాణి సాహిత్య పరిషత్ పెందోట బాల సాహిత్య జాతీయ పురస్కారం లభించినట్లు తడపాకల్ పాఠశాల తెలుగు పండితులు ప్రవీణ్ శర్మ తెలిపారు. ఉమ్మడి తెలుగు రాష్ట్రాలకు చెందిన సుమారు 80 మంది రచయితలు ఈ పురస్కారానికి వారు రచించిన పుస్తకాలు పంపగా 9 పురస్కారాల్లో వైష్ణవి ఒక పురస్కారం లభించినట్లు ప్రవీణ్ శర్మ తెలిపారు. త్వరలో సిద్దిపేటలో జరగబోయే పురస్కార సభలో వైష్ణవికి నగదు బహుమతి, ప్రశంసా పత్రం, మెమోంటోను అందజేస్తారని అన్నారు. పురస్కారం అందుకున్న వైష్ణవికి ఉపాధ్యాయ బృందం,గ్రామస్థులు అభినందనలు తెలిపారు.

టిడిపి లీగల్‌సెల్ సంబరాలు



సంబరాలు చేసుకుంటున్న టీడీపీ లీగల్‌సెల్ బృందం

నవతెలంగాణ-నిజామాబాద్ సిటీ

ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రిగా నారా చంద్రబాబు నాయుడు పదవి ప్రమాణ స్వీకారం చేసిన సందర్భంగా నిజామాబాద్ జిల్లా టిడిపి లీగల్ సెల్ అధ్యక్షుడు, న్యాయవాది రెంజర్ల సురేష్ నాయకత్వంలో జిల్లాకోర్టు చౌరస్తాలో ఘనంగా సంబరాలు నిర్వహించారు. పటాకులు పేల్చి, మిఠాయిలు పంచిపెట్టారు. ఈ సందర్భంగా సురేష్ మాట్లాడుతూ.. పరిపాలన దక్షుడుగా పేరెన్నికగన్న చంద్రబాబు నాయకత్వంలో ఆంధ్రప్రదేశ్ సర్వతో ముఖాభివృద్ధి చెందుతుందని ఆయన అన్నారు. మోడీ, చంద్రబాబు, పవన్ కళ్యాణ్ త్రిమూర్తులుగా ప్రగతిశీలక రాష్ట్రంగా తీర్చిదిద్దుతారని ఆయన తెలిపారు. చంద్రబాబు పరిపాలనలో ఆంధ్రప్రదేశ్ అన్నిరంగాల్లో నూతన ఒరవడిలో అభివృద్ధి, సంక్షేమ రంగాల్లో పయనిస్తుందని సురేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో నిజామాబాద్ బార్ అసోసియేషన్ అధ్యక్షుడు జగన్ మోహన్, ప్రధాన కార్యదర్శి వసంత్ రావు, న్యాయవాదులు సుదర్శన్ రావు, నారాయణ దాసు, భరత్ నగేష్, మానిక్ రాజు, పుణ్యరాజ్, గంగోనే శ్రీనివాస్, శ్రీమాన్, రవి ప్రసాద్, పడిగల వెంకటేష్ పాల్గొన్నారు.

గంజాయి, సైబర్ నేరాలపై అవగాహన



మాట్లాడుతున్న ఏఎస్ఐ రాజేశ్వర్‌రెడ్డి

నవతెలంగాణ-బాల్కొండ

మండలం పరిధిలోని కిసాన్ నగర్ గ్రామంలో గురువారం పోలీస్ శాఖ ఆధ్వర్యంలో గంజాయి సైబర్ నేరాలపై అవగాహన సదస్సు కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎఎస్సై రాజేశ్వర్ రెడ్డి మాట్లాడుతూ గ్రామంలో యువ కులు గంజాయికి అలవాటు పడి తమ భవిష్యత్తును నాశనం చేసుకుంటున్నారని ఎవరైనా గంజాయి అమ్మిన గంజాయి తాగిన మాకు సమాచారం అందించాలని ప్రజలకు సుచించారు. సైబర్ నేరాలపై అవగాహన కల్పించారు. గుర్తుతెలియని వ్యక్తులు ఫోను చేసి మీ యొక్క సమాచారం సేకరిస్తారని, వాటి ద్వారా మీ అకౌంట్ నుండి డబ్బులు మాయం చేస్తారని హెచ్చరించారు. ఎవరైనా గుర్తుతెలియని వారు ఫోన్లు చేస్తే సంబంధిత పోలీస్ శాఖకు సమాచారం అందించాలని అన్నారు. చిన్నపిల్లలు స్మార్ట్ ఫోన్ వాడటం వల్ల అందులో కొత్తగా యాప్స్ వేసుకుని సైబర్ నేరాలకు బలి అవుతున్నారని చిన్నపిల్లలకు సెల్ ఫోన్ ఉపయోగించకుండా చూడాలన్నారు. ప్రమాదవస్తు ఎక్కడైనా రోడ్డు ప్రమాదంలో జరిగిన వెంటనే 100 ఫోన్ కాల్ ఉపయోగించాలని ప్రజలకు సూచించారు. ఈ కార్యక్రమంలో కానిస్టేబుల్ లింగన్న పాల్గొన్నారు.